ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 22 ఆగస్టు 2025

గరిష్ఠం 31.0
కనిష్ఠం 23.0
****

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583.10 (291.9562)	4,32,065	4,32,065
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.40 (3.79)	6835.84	6125.5
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.183 (31.8797)	4,28,115	4,32,175

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220



ఎగుమతికి సిద్ధంగా ఉన్న బత్తాయిలు

దిగుబడి వచ్చే సీజన్‌లో ధర తగ్గిపోవడంతో బత్తాయి రైతులు దిగాలు పడుతున్నారు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం, దళారులపై ఆధారపడటంతో వారు చెప్పిన ధరకే బత్తాయి విక్రయించాల్సి వస్తోంది. ఉత్తరాదిలో వర్షాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

బత్తాయి ధర ఢమాల్!

- టన్ను ధర రూ.10వేల నుంచి రూ.15వేలే
- ధర లేక నష్టపోతున్నామంటోన్న రైతులు
- ఉత్తరాదిలో వర్షాల వల్లే మార్కెట్ డౌన్
- ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దళారీలదే రాజ్యం

ప్రధానంగా బత్తాయి మార్కెట్లు ఉన్న ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, లక్నో, జైపూర్ నగరాల్లో భారీ వర్షాలతో డిమాండ్ తగ్గిందని, ఆ ప్రభావం వల్లే మార్కెట్లో ధర పడిపోయిందని తెలుస్తోంది. రెండేళ్లుగా సీజన్‌లో ఇదే పరిస్థితి నెలకొనడంతో అప్పులపాలవ్వాల్సి వస్తోందని బత్తాయి తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు.బత్తాయిలు నిల్వ చేయడానికి గానీ, లేదా ప్రభుత్వం నుంచి మద్దతు ధర ఇచ్చే అవకాశం కానీ లేకపోవడంతో వచ్చిన ధరకు పంట విక్రయించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

రూ.15వేలకు లోబడే ధర

నల్లగొండ జిల్లాలో పండించిన బత్తాయిలను ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ప్రాంతానికి చెందిన వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోళ్లు చేస్తారు. సాధారణంగా ఈ సీజన్‌లో టన్నుకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుంది. ఈ ధర దక్కితే రైతులకు నష్టాలు లేకుండా ఎంతో కొంత ఆర్థికంగా లాభం దక్కుతుందని, వరుసగా రెండేళ్లనుంచి ఈ పరిస్థితి కరువైందని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో తోటల వద్ద కొనుగోలు చేసే బత్తాయిలకు మెట్రిక్ టన్నుకు రూ.12వేల నుంచి గరిష్ఠంగా రూ.15వేల వరకు చెల్లిస్తున్నారు. పైగా లోడింగ్ సందర్భంగా టన్నుకు క్వింటా వరకు తరుగు తీస్తున్నారని, తక్షణం చెల్లిస్తే ఐదు శాతం వరకు మొత్తంలో కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. పదేళ్ల లోపు తోటల్లో కాయలకు గరిష్ఠంగా టన్నుకు రూ.15వేల వరకు ధర దక్కుతుంటే, అంతకు మించి వయసున్న తోటల్లో పండిన కాయలకు టన్నుకు రూ.10వేల నుంచి రూ.12వేలకు మించి ధర ఇవ్వడం లేదు. ఈ తోటల్లో పండే కాయల్లో నాణ్యత తగ్గుతుందని, మెరుపుదనం ఉండదని దళారులు చెబుతున్నారని, చివరకు వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో బత్తాయి మార్కెట్ నల్లగొండలో ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ లావాదేవీలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాక బత్తాయి మార్కెట్‌పై ప్రభుత్వానికి, ఉద్యానశాఖకు ఎలాంటి అజమాయిషీ లేకపోవడం వల్లే దళారులు అడిగిన ధరకు ఇవ్వాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. కనీసం పంట నష్టపోతే బీమా సదుపాయం కూడా బత్తాయికి లేదని, ఎలాంటి పంట నష్టం వర్తించదని, ఏ ప్రభుత్వం వచ్చినా బత్తాయి రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సాగును తగ్గిస్తోన్న రైతాంగం

మార్కెటింగ్ ఇబ్బందులు, నిల్వ చేసే పరిస్థితి లేకపోవడం వంటి కారణాలకు తోడు, వరి సాగు సులభతరం కావడంతో జిల్లాలో బత్తాయి సాగుని రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. జిల్లాలో 2010 వరకు దాదాపు 3.10లక్షల ఎకరాల బత్తాయితోటలు ఉంటే, ప్రస్తుతం అది కాస్త 45 వేల ఎకరాలకు లోబడి పడిపోవడం తీవ్రతను తెలియజేస్తోంది. జిల్లాలో పండే బత్తాయిలను హైదరాబాద్‌తో పాటు, ఢిల్లీ, లక్నో, జైపూర్..

- మిగతా 8వ పేజీలో...

మార్కెట్‌కు తీసుకువస్తే కొనుగోలుకు ఆదేశిస్తాం..

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీ కాలనీలో బత్తాయి మార్కెట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఇక్కడ విక్రయించేందుకు రైతులు బత్తాయిలు తీసుకురావడం లేదు. రైతులు గ్రామాల్లో నేరుగా కాయలను విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు రైతులు పంట తెస్తే కొనేందు కు వ్యాపారులను ఆదేశిస్తాం. ఇతర రాష్ట్రాల్లో ధర రావడం లేద నేది మాపరిధిలోని అంశం కాదు.

- ఛాయాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

- రైతులకు ఇబ్బందుల్లేకుండా టోకెన్లు
- మరో నాలుగైదు రోజులపాటు ఇదే పరిస్థితి





అనుముల మండలం కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

జిల్లాలో పోలీస్ పహారా నడుమ యూరియా పంపిణీ చేస్తున్నారు. బుధవారం తిప్పర్తిలో మొదలైన యూరియా తిప్పలు జిల్లాలో ఇతర ప్రాంతాలకు సైతం క్రమక్రమంగా పాకాయి. గురువారం నల్లగొండ జిల్లాలో యూరియా కొరత తీవ్రంకావడంతో రైతులు పీఏసీఎస్‌లు, ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరారు. రోజురోజుకు యూరియా కోసం రైతులు ఎగబడటం అధికమవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

రైతులకు ముందుగా టోకెన్లు ఇచ్చి ఆ తర్వాత యూరియా ఇస్తున్నారు. ప్రతీ రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా ఇస్తున్నారు. మరో నాలుగైదు రోజులపాటు ఇదే పరిస్థితి నెలకొననుంది. గురువారం నాడు అనుముల మండలం కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. నార్కట్‌పల్లి, కట్టంగూరు, తిప్పర్తి మండలాల్లో పోలీసుల సమక్షంలోనే యూరియా పంపిణీ చేశారు. 520 టన్నుల యూరియాను 5వేల మంది రైతులకు గురువారం పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పోలీసులు సమన్వయం చేయడానికి మాత్రమే ఆయాకేంద్రాల..

- మిగతా 8వ పేజీలో...

ఎరువుల కోసం **బారులు**

- జిల్లాలో యూరియా ఇక్కట్లు
- గంటల వ్యవధిలోనే ఎరువులు ఖాళీ
- పాస్ పుస్తకానికి మూడే బస్తాలు

•7లో

సరిపడా యూరియా ఇవ్వకపోతే పోరాటమే

ఇద్దరు మంత్రులు ఉన్నా ఒక్క సమీక్ష చేయలేదు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్ తదితరులు

నల్లగొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా యూరియా కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి కూడా ఒక్క సమీక్ష చేయలేదని, వారం రోజుల్లో సరిపడా యూరియా ఇవ్వకపోతే రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరత రాబోయే రోజుల్లో తీవ్రమయ్యే అవకాశాలున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. రైతులు నిద్రహారాలు మాని లైన్లలో చెప్పులు పెట్టుకొని అవస్థలు పడుతున్నారని, ఎకరానికి రూ.20వేల పెట్టుబడి పెట్టి ఒక్క బస్తా యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలో వేసవిలోనే గోదాంలలో ఎరువులు నిల్వ చేసేవాళ్లమన్నారు. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ చేసేవాళ్లమని, ప్రస్తుత ప్రభుత్వంలో సమీక్షలే జరగలేదన్నారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం విక్రయించడానికి కూడా ఇబ్బందులు పడ్డారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కమీషన్లపై దృష్టి సారించడం తప్ప రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో సైతం ఈ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోనూ కమీషన్లు తీసుకొని రైతులను గాలికి వదిలేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18నెలల కాలంలో 56 సార్లు ఢిల్లీ వెళ్లాడని, కనీసం ఎరువులు తీసుకరాలేక పోయాడన్నారు. ఎరువుల కోసం కాళ్లు పట్టుకునే దుస్థితికి రైతులను తెచ్చారన్నారు. మంత్రుల తీరు వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రతీరంగంలోనూ తిరోగమనంలో ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సమయంలోనూ హమాలీలు లేకుంటే, హమాలీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేశామని గుర్తుచేశారు. నల్లగొండ నియోజకవర్గంలో దారుణమైన పరిస్థితులున్నా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎక్కడో ఉండి టైంపాస్ చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్ యాదవ్, మందడి సైదిరెడ్డి, నిరంజన్ వలీ, మాలె శరణ్యరెడ్డి, మారగోని గణేష్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, చల్లా కోటేష్, బొమ్మరబోయిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతుల బాధలు పట్టించుకోవడంలేదు

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు యూరియా కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని తాటికల్ సింగిల్‌విండో కార్యాలయం వద్ద యూరియాకోసం పడిగాపులు కాస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలన్నారు. చంటి పిల్లలతో యూరియా కోసం వచ్చిన మహిళా రైతులు గంటలు తరబడి నిరీక్షిస్తున్నారన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి, హైదరాబాద్‌కు తిరగడం తప్ప రైతుల బాధలు పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండేవారన్నారు. ఆయనవెంట మునిసిపల్ కౌన్సిలర్ పల్లె విజయ్, నాయకులు ప్రగడపు నవీన్‌రావు, గొర్ల వీరయ్య, యానాల లింగారెడ్డి, పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- కలెక్టర్ ఇలాత్రిపాఠి



జిల్లాకేంద్ర ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై గృహనిర్మాణ శాఖ అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గంలోని మండలాల ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణ ఇంజనీర్లు, ఎంపీడీవోలు ప్రత్యేకశ్రద్ధ వహించి గ్రౌండింగ్‌ను పెంచాలన్నారు. నల్లగొండ మునిసిపాలిటీతోపాటు, కనగల్, తిప్పర్తి మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇసుక సమస్యను తహసీల్దార్లు పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

చిన్నారులపట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

నల్లగొండ టౌన్: సీజనల్ వ్యాధులబారిన పడిన చిన్నారులను ఆస్పత్రికి తీసుకొస్తే, వెంటనే వైద్యం అందించాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని ఆమె గురువారం తనిఖీ చేశారు. పిల్లల వార్డులో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో వ్యాధి నివారణ మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రిలో చేరిన పిల్లలకు సంబంధించి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ కేసుల వివరాలను అడిగారు. ఆమెవెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ కుమారి, చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన, డాక్టర్ నగేష్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ వినోద్



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, విదేశీ వస్తువులను త్యజించాలని స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ వినోద్ హిందుస్తానీ అన్నారు. గురువారం స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అమెరికా, చైనా, టర్కీ మొదలైన విదేశీ వస్తువులను వినియోగించవద్దని, వీలైనంత ఎక్కువగా మన దేశ ఉత్పత్తులనే వాడి, దేశ జీడీపీని పెంచి, ఇక్కడి పరిశ్రమలకు అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంకోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. చైనా వంటి దేశాలు అధిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ఉపయోగించి, అతి తక్కువ ధరలో, నాసిరకం వస్తువులను డంప్‌చేస్తూ, మన తయారీ రంగాన్ని బలహీనపరుస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వదేశీ ఆచరణ మన జాతీయ ప్రయోజనాలను కాపాడే ప్రధాన ఆయుధం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పొట్టిపాక నాగరాజు, ఆవుల సంపత్, అమల, లక్ష్మి, శ్రీదేవి, మౌనేశ్వర్‌చారి, మణికుమార్, హరీష్, బన్నీ, జయంత్, రుత్విక్, లక్ష్మీనివాస్, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

దామరచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని థర్మల్ ప్లాంట్ పరిసర గ్రామాల ప్రజలు అన్నారు. దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో భూములు కోల్పోయిన స్థానికులకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం పరిశ్రమ గేటు వద్ద సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ చిత్రపటాలకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు కోసం తమ భూములు కోల్పోయామని, గతంలో తమకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయని, అందులో భాగంగా తమకు నియామకపత్రాలు అందించడం హర్షణీయమన్నారు. 335 మందికి ఉద్యోగ పత్రాలు అందించి విధుల్లోకి తీసుకోనున్నారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వస్త్ర మన్నికలో 'రామ్‌రాజ్'దే అగ్రస్థానం

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడలో రామ్‌రాజ్ కాటన్ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వస్త్ర మన్నికలో, నాణ్యతలో రామ్‌రాజ్ కాటన్‌దే అగ్రస్థానమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడలో రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల నూతన షోరూంను ఆయన సతీమణి విజయతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిపుణులతో రూపొందించిన వస్త్రాలనే తయారు చేస్తూ రామ్‌రాజ్ కాటన్ వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల కోసం ఆన్‌లైన్‌లో సైతం వస్త్ర విక్రయాలు కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా ధోతీల విక్రయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఏకైక సంస్థ రామ్‌రాజ్ అన్నారు. మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపక చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ 'గౌరవనీయులు' అనే ముద్రతో విక్రయమవుతున్న రామ్‌రాజ్ కాటన్ దుస్తులు అందాన్ని, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షించడానికి కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ప్రారంభించినట్లు తెలిపారు. రాజీలేని నాణ్యతే కంపెనీని వస్త్ర ప్రేమికులకు చేరువ చేస్తోందన్నారు. ధోతీలలో తొమ్మిది రకాలు, షర్ట్‌లలో 10 రకాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. శ్రీలంక, సింగపూర్, మలేషియా తదితర దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జీ పగిడిమర్రి గోవర్ధనాచారి, మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి శ్యామ్ పాల్గొన్నారు.

పర్యావరణ హితమైన అభిమానం



సినీనటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు పర్యావరణ హితమైన పని చేశారు. పర్యావరణ ప్రేమికుడు, అభిమాన సంఘ నాయకుడైన అవిరెండ్ల సందీప్ 15వేల విత్తనాలు నాటి అభిమాన హీరో చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు స్థాపించిన నాటినుంచి పలుమార్లు రక్తదానం చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మిత్రులతో కలిసి నాలుగు లక్షల విత్తనాలు సేకరించి అడవిలో చల్లినట్లు తెలిపారు. సందీప్‌తో పాటు బొంగర్ల నరేష్, కందికంటి సంజీవ, ఉబ్బపల్లి రాజేష్, పవన్, విష్ణు, చింటు తదితరులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

సంస్కృతికి ప్రతిబింబం పండుగ



బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకలు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని విశాల భారతి హైస్కూల్ విద్యార్థులు గురువారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోతురాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశాల భారతి హైస్కూల్ కరస్పాండెంట్ బీమిడి సుభాష్‌రెడ్డి, నిర్వాహకుడు చైతన్య క్రాంతివర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం కే ఆంజనేయులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి- చౌటుప్పల్ టౌన్)

ఎలా ఉన్నావ్ భరత్.. నువ్వు ఎస్‌ఐ కావాలి



యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం శేరిగూడెం గ్రామాన్ని గురువారం ఆ జిల్లా కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. తాను దత్తత తీసుకున్న విద్యార్థి భరత్‌చంద్రాచారి ఇంటికి వెళ్లారు. భరత్ ఎలా ఉన్నావంటూ పలుకరించారు. మీ అమ్మ, చెల్లి ఆరోగ్యం ఎలా ఉంది, నీకు నచ్చిన కాలేజీ, గ్రూప్‌లో చేర్పించా, చదువు ఎలా సాగుతుందని విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. ఏం కావాలన్నా ఫోన్ చేయమని భరోసా ఇచ్చారు. నువ్వు కోరుకున్నట్లు ఎస్‌ఐ కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నెల రోజులకు కావాల్సిన ఇంటి సామగ్రి, ఆర్థికసాయంగా రూ.5 వేలు అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమోద్‌కుమార్, ఎంపీవో నర్సింహారావు, కార్యదర్శి సుభాష్ ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి-సంస్థాన్‌నారాయణపురం)

సైకిల్ చక్రంతో దంతె తయారీ

సమయం ఆదా, కూలీల కొరతను అధిగమిస్తున్న రైతు శ్రీను

(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)





బద్దుతండాలో సైకిల్ చక్రంతో తయారు చేసిన దంతెతో కలుపు తీస్తున్న రైతు శ్రీనివాస్

స్వయంశక్తితో యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బద్దుతండాకు చెందిన గుగులోతు శ్రీనివాస్ సాగులో ముందుకు సాగుతున్నాడు. సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు కూలీల కొరతను అధిగమించేందుకు పాత సైకిల్‌చక్రంతో కలుపు(దంతె) యంత్రాన్ని రూపొందించాడు. వ్యవసాయ రంగంలో కొంతమంది ఆధునిక పద్ధతుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సాగు చేస్తుండగా, మరికొందరు పాతతరం పద్ధతులను అవలంబిస్తున్నారు. ఏ విధానం పాటించినా అందరూ ఎదుర్కొనే ప్రధాన సమస్య కలుపు తీత. ఒక్కసారి పెరిగిన కలుపు పంటను ఎదగనివ్వదు. కలుపు నివారణకు రైతులు ఎడ్లతో దంతె కొట్టడం, కూలీలతో కలుపు తీయిస్తుంటారు. అయితే దంతె కొట్టాలంటే ఎద్దులు కావాలి, జంట ఎద్దులు కొనాలంటే రూ.70 వేల వరకు ఖర్చవుతుంది. అద్దెకు తీసుకున్నా రోజుకు రూ.1000 చెల్లించాలి. ఇది చిన్న, సన్నకారు రైతులకు ఆర్థికభారంతో కూడింది. కూలీలతో కలుపు తీయించాలంటే కూలీల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో గుగులోతు శ్రీను వినూత్నంగా ఆలోచించి కలుపు నివారణకు ఓ యంత్రాన్ని తయారు చేయించుకున్నాడు. రూ.1,800లతో సైకిల్ చక్రానికి చిన్నపాటి దంతెను తయారు చేయించాడు. ఈ దంతె వాణిజ్య పంటల్లో మాత్రమే కలుపు తీయడానికి ఉపయోగపడుతుందని, రోజుకు ఒక వ్యక్తి గుంట భూమిలో కలుపు తీయవచ్చునని రైతు శ్రీను తెలిపాడు.

జాన్‌పహాడ్ గ్రామకార్యదర్శిపై కేసు నమోదు

నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చిన అధికారులు



కార్యదర్శి వెంకయ్య, వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ

పాలకవీడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఇంజమూరి వెంకయ్యను గురువారం ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అరెస్టుచేశారు. అనంతరం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో అతడిని హాజరుపర్చారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల నుంచి లంచం అడిగినట్లు ఆడియో వైరల్ కావడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శిని సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ కేసు నమోదుచేయాలని ఆదేశించిన నేపథ్యంలో గురువారం విచారణకు వచ్చిన ఏసీబీ అధికారులు కార్యదర్శి వెంకయ్యపై కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలను సహించబోమన్నారు.

రెవెన్యూ రికార్డులు మార్చిన వ్యక్తిపై కేసు నమోదు

గరిడేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ రికార్డులు మార్చిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని కల్మలచెర్వు రెవెన్యూ రికార్డు పరిధిలోని సర్వే నెంబర్ 59లోని వ్యవసాయ భూమి రమావత్ నాగమణి పేరున ఉంది. అయితే 2010-11 రెవెన్యూ పహణీలో భూక్యా శంకర్ అనే వ్యక్తి నాగమణి పేరును చెరిపి తన పేరు పట్టాదారు కాలంలో రాశాడు. గుర్తించిన గరిడేపల్లి తహసీల్దార్ బండ కవిత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపాడు.

ఎవరి ప్రమేయం ఉందో తేల్చండి: కలెక్టర్

కల్మలచెర్వు పట్టా రికార్డుల్లో పేరు మార్చిన ఘటనపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ స్పందించారు. గురువారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో గరిడేపల్లి మండల కార్యాలయంలో రికార్డుల్లో పేరు మార్చిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. రికార్డుల్లో మరొకరి పేరు చేర్చడంలో శంకర్‌తో పాటు ఎవరి ప్రమే యం ఉందో తేల్చాలని, తదుపరి వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కవితను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా లావణ్యరాణి

మిర్యాలగూడ లీగల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా మజ్జి లావణ్యరాణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా లావణ్యరాణి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రాంతం.

మృత్యువులోనూ వీడని స్నేహం

- **రోడ్డు ప్రమాదంలో స్నేహితులు దుర్మరణం**
- **సాగర్ - హైదరాబాద్ రహదారిపై ప్రమాదం**



వెంకటేశ్వరనగర్‌లో రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



నరసింహ(ఫైల్)




సందీప్(ఫైల్)

చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందారు. బుధవారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్(మాల్)లో సాగర్-హైదరాబాద్ హైవేపై జరిగింది. ఎస్‌ఐ రాంమూర్తి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్‌కు చెందిన కోడిదూటి నరసింహ(23), తల్లోజు సందీప్ (22) స్నేహితులు. నరసింహ ఇంటర్ పూర్తి చేసి తండ్రి రమేష్‌తో కలిసి ప్లంబర్ పనిచేస్తుండగా, సందీప్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. తమ గ్రామానికి సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా యాచారం మండలం పాత మాల్‌లో బోనాలు నిర్వహిస్తుండగా, పండుగను చూసేందుకు బుధవారం ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా వెంకటేశ్వరనగర్(మాల్)లో అదుపుతప్పి సాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై డివైడర్‌ను ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. తమకు ఆసరాగా ఉంటున్న కుమారులు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. నరసింహ, సందీప్ మంచి స్నేహితులని, మరణంలోనూ స్నేహాన్ని వదలలేదని స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్ సూపర్‌వైజర్

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కొత్తగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి పవర్‌ప్లాంట్ సూపర్‌వైజర్ మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ-2 సైదులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని హైమద్‌నగర్ సమీపంలోని గౌతమ్‌కాలనీకి చెందిన సోమనాథ్ ఉత్తమ్‌గారడీ(27) రెండేళ్లుగా దామరచర్ల మండలంలోని యాదాద్రిపవర్ ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఔషధాల కోసం తన ద్విచక్రవాహనంపై మిర్యాలగూడకు వస్తున్నాడు. మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం సోమనాథ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి చికిత్సనిమిత్తం తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఉత్తమ్‌గారడీ బంధువు సంతోష్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా దహన సంస్కారాల కోసం స్వగ్రామానికి తీసుకెళ్లారు.

ప్రమాదాలకు నిలయంగా మలుపులు



ప్రమాదకరంగా విరాట్‌నగర్ నుంచి వింజమూర్‌కు వెళ్లే దారిలో మలుపు

చింతపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రద్దీగా మారిన ఈ రహదారిపై మూలమలుపులు ఇరుకు రహదారి ప్రాణాలను తీస్తున్నాయి. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

పెరిగిన రద్దీ

నాగార్జునసాగర్ క్రస్ట్‌గేట్లు 26 ఎత్తడంతో హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై పర్యాటకుల రాకపోకల రద్దీ మరింత పెరిగింది. 32 కిలోమీటర్లు విస్తరించి ఉన్న ఈ రహదారిపై వాహనదారులు మితిమీరిన వేగం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, అజాగ్రత్త, నిద్రమత్తుతో వాహనాలు నడుపుతుండటంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు, సూచికలు వేగ నియంత్రణ చర్యలు చేపట్టలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలేపల్లిరాంనగర్, మదనాపురం గేట్ నుంచి వెళ్లే మార్గంలో వాహనాలు అధిక శాతం అదుపుతప్పుతున్నాయి. ప్రశాంతపురి తండా, కుర్మేడ్‌గేట్, విరాట్‌నగర్‌కాలనీ సమీపంలో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ధైర్యపురితండాతో వింజమూరు, చింతపల్లి, నసర్లపల్లి సమీపంలో మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

సూచికలు ఏర్పాటు చేస్తాం

మూలమలుపుల్లో ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలో రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించి రేడియం స్టిక్కర్లు, సూచికలు ఏర్పాటు చేయిస్తాం. రోడ్డు ప్రమాదాల నివారణకు వేగనియంత్రణ చర్యలు చేపడతాం.

ప్రభాకర్, డీఈఈ, దేవరకొండ.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రి అంత్యక్రియల్లో ముందు నడుస్తున్న జోగు సైదమ్మ

నార్కట్‌పల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది ఓ కుమార్తె. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గురువారం చోటు చేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన మోటె మల్లయ్య(70) వృద్ధాప్యంతో మృతిచెందాడు. కాగా మల్లయ్యకు ముగ్గురు కుమార్తెలు కాగా కుమారులు లేరు. ముగ్గురు కుమార్తెల వివాహాలు జరిగాయి. మల్లయ్య చనిపోగా ఆయన పెద్దకుమార్తె శాలిగౌరారం మాజీ ఎంపీటీసీ జోగు సైదమ్మ తండ్రి అంత్యక్రియలకు ముందు నడిచింది. హిందూ సంప్రదాయం ప్రకారం తలకొరివి పెట్టి తన తండ్రికి కొడుకు లేని లోటును తీర్చింది.

ఇంకుడు గుంత నిర్మించుకోవాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అప్పారావు

మద్దిరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సూర్యాపేట జడ్పీ సీఈవో, డీఆర్‌డీవో పీడీ అప్పారావు అన్నారు. గురువారం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఇంకుడుగుంతలు, పశువుల కొట్టాలను పరిశీలించి, మాట్లాడారు. ఇంకుడు గుంతల గురించి ప్రజలకు ఉపాధి సిబ్బంది వివరించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణంతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయన్నారు. వేసవిలో నీటి కొరతకు అవకాశం ఉండదన్నారు. వానాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీవో గుండు వెంకన్న, సిబ్బంది చారి, మురళి, పంచాయతీ కార్యదర్శి ఉమ, ఎఫ్ఏ ఉమ ఉన్నారు.

ఉపాధిహామీలో పనుల జాతర



- **కూలీలకు ఉపాధి కల్పన భరోసా**
- **నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో పనుల గుర్తింపు**

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పనులు కల్పించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. 2025-26 ఆర్థికసంవత్సరానికి కూలీలను పనులు కల్పించేందుకు ఈ నెల 22 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పనుల జాతర కార్యక్రమానికి అధికారయంత్రాంగం శ్రీకారం చుట్టింది. గ్రామసభల్లో స్థానికుల సమక్షంలో 18రకాల పనులను గుర్తించనున్నారు. కూలీలకు 100 రోజుల పనిదినాలు కల్పించేందుకు వీలుగా వార్షిక ప్రణాళిక రూపొందించనున్నారు. కార్యక్రమానికి ఎంపీ, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరవుతండగా, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో పాటు పంచాయతీరాజ్, స్వచ్ఛభారత్‌మిషన్, ఆర్ డబ్ల్యూఎస్ శాఖల అధికారులు పాల్గొననున్నారు.

అభివృద్ధి పనులకే ప్రాధాన్యం

ఉపాధిలో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం ఇచ్చేందుకు పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీకేంద్రాల నిర్మాణం, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల డంపింగ్‌యార్డ్, సెగ్రిగేషన్‌షెడ్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, సీసీ రోడ్ల పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అదేవిధంగా 2024-25 ఆర్థికసంవత్సరంలో ఉపాధి నిధులతో చేపట్టిన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపడతారు. పాడిపోషణను ప్రోత్సహించేందుకు ఇందిరమ్మమహిళా శక్తి- ఉపాధి భరోసా కింద స్వయం సహాయకసంఘాల్లోని మహిళలకు పశువుల పాకలు, కోళ్ల, గొర్రెల షెడ్లు, వ్యవసాయ బావుల తవ్వకాలు, కంపోస్టు ఎరువు తయారీ యూనిట్లను మంజూరు చేస్తారు. గ్రామసభల్లో లబ్ధిదారులు ఆసక్తిచూపిన యూనిట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేయనున్నారు. ప్రతి గ్రామంలో కనీసం ఒక పనినైనా ప్రారంభించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఫలవనాలు-వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యమిస్తారు. జలనిధి కార్యక్రమంలో భాగంగా భూగర్భజలాలను మెరుగుపరిచేందుకు వీలుగా నీటిసంరక్షణ చర్యలు చేపట్టడం, పచ్చదనాన్ని పెంపొందించడంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టేవారిని, గత ఆర్థికసంవత్సరంలో అత్యధికం ఉపాధిహామీ పనిదినాలు ఉపయోగించుకున్న కుటుంబాలను గుర్తించి సన్మానిస్తారు.

రూ.37.50 కోట్లతో 3,918 రకాల పనులు

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా ఉమ్మడి జిల్లాలో 3,918 రకాల పనులకు పరిపాలన పరమైన అనుమతులు లభించాయి. ఆయా పనులను అధికారులు గుర్తించిన గ్రామాల్లో చేపట్టేందుకు రూ.37.50కోట్ల నిధులను 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఖర్చుచేయనున్నారు. మంజూరైన పనుల వివరాలు ఇలా ఉన్నాయి. రూ.93లక్షలతో 940 పశువులపాకల నిర్మాణం, రూ.7.72లక్షలతో 429 నాడెప్ కంపోస్ట్‌పిట్ల నిర్మాణాలతో పాటు రూ.10లక్షలతో 452 నాచుతయారీ కేంద్రాలు (అజోలా), రూ.8లక్షలతో 63మేకలు/గొర్రెల పాకలు, రూ.7.80లక్షలతో 26 కోళ్లఫారాలు, పాఠశాలల్లో 62 మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15.50 లక్షలు కేటాయించారు. అదేవిధంగా తాగునీటి సదుపాయాలకు రూ.8లక్షలతో 213 మినీవాటర్‌ట్యాంకుల నిర్మాణం, రూ.35లక్షలతో 62 వ్యవసాయబావుల తవ్వకాలు, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ కింద రూ.6.57లక్షలతో 153 యూనిట్ల పనులు మంజూరయ్యాయి. 539 ఇంకుడుగుంతల నిర్మాణంకోసం రూ.35లక్షలు కేటాయించారు. చెక్‌డ్యాం నిర్మాణాలు రూ.5లక్షలు, 10 ఆర్‌ఎఫ్‌డీల కోసం రూ.6లక్షలు, 18సీఎస్‌సీల నిర్మాణం కోసం రూ.5.40లక్షలు, రూ. 20లక్షలతో 5 పీడబ్ల్యూఎం నిర్మాణాలు, 24 సెగ్రిగేషన్ షెడ్స్ నిర్మాణాల కోసం రూ.39లక్షలు, 792కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం కోసం రూ.73.45లక్షలు కేటాయించారు. 64 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం రూ.7.68కోట్లు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.13కోట్ల నిధులను కేటాయించారు.

అభివృద్ధి పనులతో పాటు కూలీలకు ఉపాధి



గ్రామీణాభివృద్ధి పనులతో పాటు కూలీలకు 100రోజుల పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. నల్లగొండ జిల్లావ్యాప్తంగా నేటినుంచి పనుల జాతర కార్యక్రమానికి ఏర్పా ట్లు పూర్తిచేశాం. పాడిరైతులను ప్రోత్సహిం చాలన్న ఉద్దేశ్యంతో స్వయం సహాయకసంఘాల సభ్యులకు ప్రాధాన్యనిస్తున్నాం. ప్రజల జీవనోపాధి పెంచేందుకు పలు వ్యక్తిగత పథకాలను ప్రభుత్వం అమలుచేస్తుండగా, క్షేత్రస్థాయి విధులను సమర్థంగా పూర్తిచేసేందుకు లబ్ధిదారులను గుర్తిస్తాం. గ్రామీణప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

వై.శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ, నల్లగొండ

ఊకొండిలో వివాహిత ఆత్మహత్య



లక్ష్మీ ప్రసన(ఫైల్)

మునుగోడు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ మండలం అప్పాజిపేట గ్రామానికి చెందిన కల్లూరి శంకరయ్య రెండో కుమార్తె లక్ష్మీప్రసన్నకు మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన బోయపల్లి నాగరాజుతో ఈ ఏడాది మార్చి 2న వివాహమైంది. ఆషాఢమాసంలో తల్లిగారింటికి వెళ్లిన లక్ష్మీప్రసన్న ఇటీవల గ్రామంలో జరిగిన బోనాల పండగను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపింది. కాగా గురువారం ఇంట్లోనే తన గదిలో క్రిమిసంహారక మందు తాగింది. ఇంటి పక్కన ఉన్న మహిళ వచ్చి చూసేసరికి లక్ష్మీప్రసన్న అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చుట్టుపక్కల వారికి, కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపి హుటాహుటినా నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని మునుగోడు ఎస్‌ఐ రవి తెలిపారు.

విద్యార్థి అదృశ్యం, కేసు నమోదు



రితిష్‌యాదవ్

భువనగిరి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారంలోని డిఫెన్స్ కళాశాల నుంచి ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఓల్డ్ బేగంపేటకు చెందిన రాశి నగేశ్‌యాదవ్ కుమారుడు రాశి రితిష్‌యాదవ్(18) భువనగిరి మండలం అనంతారం శివారులోని శ్రీ వాగ్దేవి డిఫెన్స్ కళాశాలలో(ఆర్మీ)కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం కళాశాల నుంచి కనిపించకుండాపోయాడు. ఈ విషయమై కళాశాల నిర్వాహకులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో గురువారం తండ్రి నగేశ్‌యాదవ్ భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. వివరాల కోసం 8712662472 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో కోరారు.

ఎరువుల కొరత.. రైతుల వెత



కోదాడరూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా అవసరమైన ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

» ఇదే అదునుగా అధిక ధరలకు డీలర్ల విక్రయం

సూర్యాపేట జిల్లాలో 11 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బావులు, చెరువులు, కుంటల కింద రైతులు పెద్ద ఎత్తున వరి సాగుచేస్తున్నారు. అనంతగిరి మండలంలో 13,168హెక్టార్లు, చిలుకూరు మండలంలో 20,330, కోదాడ 21,150, మోతె 22397, మునగాల 13407, నడిగూడెం 9535 హెకార్లలో వరి సాగుచేస్తున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవటంతో అధిక ధరలకు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ముందుగా వర్షాలు పడటంతో రైతులు, బావులు, చెరువులు, కుంటల కింద ముందస్తుగా నార్లు పోశారు. రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా అందుబాటులో లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. సహకార సంఘాల్లో కూడా ఎరువులు ఈ సంవత్సరం సకాలంలో అందకపోవడంతో రైతులు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నారు. పోసిన నారు ఏపుగా పెరుగుతోంది తప్ప నాటు వేసేందుకు అవకాశం లేకుండా పోయిందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లు

యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉండటంతో ఇదే అదునుగా ఎరువుల దుకాణం డీలర్లు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 265 రూపాయల యూరియా కట్ట 450 రూపాయలు విక్రయిస్తున్నారు. 1325 డీఏపీ కట్టను 1600 రూపాయలకు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు తెలిపినా కూడా పట్టించుకోవటం లేదన్నారు. పొటాష్ కూడా 1800కు పైగా విక్రయిస్తున్నారని వారు అన్నారు.

ఊహించని విధంగా పెరిగిన సాగు

సంవత్సరం ఊహించని విధంగా సాగు పెరిగిపోవడంతో దానికి అనుగుణంగా ఎరువులు సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవవమే అని అధికారులు పేర్కొంటున్నారు. సహకార సంఘాల్లో కూడా ఈ సంవత్సరం ప్రభుత్వం సరిపడా ఎరువులను సరఫరా చేయకపోవడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



యూరియా డీఏపీ, పొటాష్ అధిక ధరలకు విక్రయించినట్లయితే చర్యలు తీసుకుంటామని ఏడీఏ ప్రశాంతి తెలిపారు. యూరియా కొరత ఉన్నమాట వాస్తవమే అన్నారు. సహకార సంఘాల్లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ అందుబాటులో ఉందన్నారు.

ఏ మండలానికి ఎంత అవసరమంటే...

మండలం	యూరియా మె.ట అవసరం/నిల్వ	డీఏపీ మె.ట అవసరం/నిల్వ	కాంప్లెక్ మె.ట అవసరం/నిల్వ
కోదాడ	5310/442	2950/301	3982/435
మోతె	3400/276	1350/143	3200/551
అనంతగిరి	26,26/143	226/16	1226/38
చిలుకూరు	30,38/26	200/18	2230/391
మునగాల	3530/456	1020/163.85	3010/711.95
నడిగూడెం	4700/130	2350/70	3650/120



తిప్పర్తి పీఏసీఎస్ వద్ద యూరియా లోడ్ దించుకున్న సిబ్బంది

యూరియా కోసం ఇక్కట్లు

తిప్పర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్దకు ఒక లారీ యూరియా వచ్చింది. లోడ్‌లో 440 బస్తాల యూరియాను ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున ఇచ్చి పంపిణీ చేశారు. యూరియా లారీ వద్ద రైతులు ఆందోళన చేయకుండా పూర్తిగా పోలీస్ పహారా ఉంచి ఎస్ఐ వి. శంకర్ ఆధ్వర్యంలో రైతులందరికీ పంపిణీ చేయించారు. కాగా మరో 300ల మంది ప్రస్తుతం ఆధార్ కార్డులను లైన్‌లో ఉంచినట్లు సమాచారం. కాగా మరో రెండు రోజుల్లో ఎక్కువ మొత్తంలో యూరియా రానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తిరుమలగిరిలో తంటాలు

తిరుమలగిరి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల దుకాణం వద్ద రైతులు పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 12గంటలు దాటినా దుకాణం తెరవకపోవడంతో, దుకాణం వద్ద నిరీక్షించారు. దుకాణం తెరిచిన వెంటనే ఒక్కసారిగా యూరియా కోసం రైతులు చేరుకోవటంతో, ఉదయం నుండి నిల్చున్నా, కొంతమందికి యూరియా లభించలేదని, మరికొందరికి రెండు, లేదా మూ డు బస్తాలే ఇచ్చారని, వారికి నచ్చిన వారికి మాత్రం ఎక్కువ బస్తాలు ఇచ్చారని వాపోయారు. కొందరు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరి యా కోసం వె ళితే గుళికలు కొంటేనే యూరియా ఇస్తామని షరతులు పెడుతున్నారని రైతులు వాపోయారు.



యూరియా కోసం వేచి ఉన్న రైతులు



కట్టంగూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

కట్టంగూరులో బారులు

నార్కట్‌పల్లి/ కట్టంగూరు/ హాలియా, ఆగస్టు 21: నార్కట్‌పల్లి, కట్టంగూరు, హాలియా మండల కేంద్రాలకు యూరియా వచ్చిందని తెలియగానే రైతులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఒక్కో రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు ఇవ్వడంతో సరిపడా యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కట్టంగూరులో ఎస్ఐ రవీందర్ పోలీస్ సిబ్బందితో వచ్చి పోలీస్ పర్యవేక్షణలో టోకెన్లు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి సతీష్ పీఏసీఎస్‌ను పర్యవేక్షించారు. కట్టంగూరు మండలానికి 2400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 1800 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏవో గిరి ప్రసాద్ తెలిపారు. నార్కట్‌పల్లి పీఏసీఎస్‌కు ఉదయం 400 బస్తాల యూరియా రాగా ఉదయం11 గంటలకే 200బస్తాలు అయిపోయాయి. అనుముల మండలం కొత్తపల్లి పీఏసీఎస్ గోదాంకు 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు పరిసర గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. ఒక్కో పాస్ బుక్‌కు మూడు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

ప్రపంచం ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుంది

ప్రజావాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



వీధినాటకోత్సవంలో పాట పాడుతున్న వాగ్గేయకారుడు గోరటి వెంకన్న

రామన్నపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తరాలు మారినా ప్రజా కళాకారుల స్వరాలు మారవని, ఈ భూ ప్రపంచం ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని, పోరాట ఆయుధాలుగా మలిచే కళారూపాలు ఉంటాయని ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో రెండోరోజు జరిగిన వీధి నాటకోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజానాట్యమండలి కళాకారులు తేనెతో నిండిన తియ్యటి పండ్లు లాంటివారని, నిస్వార్థంగా ప్రజాకళను బ్రతికిస్తున్నారన్నారు. పాటతో నైజాం నవాబు గుండెల్లో తూటాలు పేలిన సుద్దాల హనుమంతు నడయాడిన నేల రామన్నపేట ప్రజాకళాకారులతో నేడు పునీతమైందని, ఇలాంటి మహోన్నతమైన ప్రజా కళారూపాల ప్రదర్శన నిర్వహించడం ప్రజా కళలను నిజంగానే బతికించడమేనన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారుల వీధి నాటకాలు ప్రజలను ఆకర్షించాయి. 'అది నాదే ఇది నాదే', 'ఆడపిల్ల' ఒగ్గు కథ, రైతు బతుకు', హరే రామ హరి' అనే నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేముల ఆనంద్, కట్టా నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవ్వారు గోవర్దన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటెపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, డి.రవి, కుమ్మరి శంకర్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు జాతీయస్థాయిలో రాణించాలి

● ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి

నల్లగొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో రాణించి ఎంజీయూ ఖ్యాతిని చాటాలని రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి సూచించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ 2025 కోసం ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఎంపికను గురువారం యూనివర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ యూత్ ఆఫీసర్ సైదా నాయక్ హాజరై వాలంటీర్లకు రన్నింగ్ పరేడ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వలంటీర్ల జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఎంపికైన వలంటీర్లు గుజరాత్‌లో జరిగే శిబిరానికి పంపిస్తామని, వలంటీర్లు కళాశాల బోనఫైడ్ సర్టిఫికెట్ ఐడీ కార్డు స్పెషల్ క్యాంపు సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పసుపుల మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ ఎన్‌ఎస్‌ఎస్ అధికారి నరసింహ, ప్రోగ్రాం అధికారులు వీరస్వామి, సుధాకర్, ఆనంద్, శ్రీనివాస్, కాంతయ్య, దయానంద్, శ్యామల, మేనేశ్వరి, పావని, శృతి, వలంటీర్లు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంతో అధిక ప్రయోజనం

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటరమణారెడ్డి

ఆలేరు/ మోత్కూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆలేరు మండలం బహదూర్‌పేటలో రైతులకు నానో యూరియా వాడకంతో సాగు చేసిన పత్తి పంటను సందర్శించి వారికి అవగాహన కల్పించారు. నానో యూరియా వాకడంపైన రైతులకు గల సందేహాలను నివృత్తి చేశారు. 45కిలోల యూరియా బస్తాకు 500 మిల్లీ లీటర్ల నానో యూరియా సమానమని, రేటు కూడా అంతేనని వివరించారు. పంటల మీద యూరియా చల్లితే సగం నత్రజని మాత్రమే మొక్కలో చేరుతుందని మిగిలినది నేలనీటితో కలిసి కాలుష్యాన్ని పెంచుతుందని, అదే నానో యూరియాను స్ప్రే చేయడం ద్వారా నత్రజని నేరుగా మొక్కలో చేరుతుందన్నారు. ఈ యూరియా వాడకం ద్వారా యూరియా వినియోగాన్ని 25 నుంచి 40శాతం తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారని అన్నారు. పంట దిగుబడి కూడా బాగా పెరుగుతుందని ద్రవ రూపంలో ఉండే నానో యూరియాలోను యూరియాతో సమానమైన నత్రజని ఉంటుందని తెలిపారు. దీని రవాణా నిల్వ వినియోగం కూడా సులభం ఉండడమే కాకుండా రైతులకు ఆర్థిక భారం తగ్గిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏఈఓలు షాలిని, శివ కుమార్, రైతులు స్వామి, రాజు, వినయ్, మల్లయ్య, శేఖర్, పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.



ఆలేరు: బహదూర్‌పేటలో నానో యూరియా వాడకంతో సాగుచేసిన పత్తిపంటను రైతులకు చూపుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

● పంటలకు నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల అధికప్రయోజనం చేకూరుతుందని ఎంఏవో వి.కీర్తి అన్నారు. నానో యూరియా వాడకంతో చేకూరే ప్రయోజనాలపై మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఆమె రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాటిమట్ల, దత్తప్పగూడెం ఏఈవోలు ఎం.అశోక్‌కుమార్, ఆర్.సింహప్రసాద్, రైతులు బండ నర్సిరెడ్డి, దొండ దశరథ, బండి రవి, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

యూరియా కొరత కారణంగా ఎరువుల దుకాణాల యజమానులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లింకులు పెట్టి అమ్ముతున్నారు. సకాలంలో దొరక్క రైతులు యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. లోడ్ వచ్చిందని తెలియగానే వెళ్లి గంటల తరబడి లైన్లలో నిల్చుని అష్టకష్టాలు పడి తీసుకెళ్లుతున్నారు. దీనిపై నెల 6న 'అవగాహన కల్పిస్తే ప్రయోజనం' శీర్షికన నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికిఅధికారులు స్పందించారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవగాహన కల్పిస్తున్నారు.

నా రాజీనామాతోనే గట్టుప్పల్ మండలం ఏర్పడింది

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

గట్టుప్పల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తేనే గట్టుప్పల్ మండలం ఏర్పడిందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఓ పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడుతూ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వల్ల మండలం రాలేదని అతను అసెంబ్లీలో మాట్లాడినా మండలం ఏర్పడలేదని.. తాను రాజీనామా చేస్తేనే ప్రభుత్వం దిగివచ్చి మండలం ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన నిధులతో పాటు సొంత డబ్బుతో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. పాఠశాలల అభివృద్ధికి ఆర్థికంగా స్థిరపడినవారు మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం ప్రతీ మనిషికి రెండు కళ్లలాంటివని గుర్తుచేశారు. అందుకే తల్లి సుశీలమ్మ పేరుతో ఫౌండేషన్ ద్వారా అన్ని మండల కేంద్రాలలో ఉచిత కంటి వైద్య శిబిరాలు సైతం ఏర్పాటు చేశానని తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాను నిరంతరం అండగా ఉంటానని అన్నారు. త్వరలోనే గట్టుప్పల్ మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని అన్నారు. సొంత డబ్బుతో ఈ పాఠశాలను కట్టించి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఇడెం శ్రీనివాసులును అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల సమితి అధ్యక్షుడు ఇడెం శ్రీనివాస్. రాష్ట్ర మునిసిపల్ మాజీ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్ రెడ్డి రాజు, సీఐ ఆదిరెడ్డి, తహసీల్దార్ రాములు. మాజీ సర్పంచ్ నామ జగనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి శ్రీనివాసు, రావుల రమేష్, టేకుమట్ల శ్రీరాములు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఎంజీయూ అధ్యాపకులకు శిక్షణ

నల్లగొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇన్ఫ్లిబ్ నెట్ సంస్థ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా ఇన్ఫ్లిబ్ నెట్ సంస్థ ప్రతినిధి అర్షద్‌ఖాన్ సారథ్యంలో మూక్స్ ఆన్ లైన్ కోర్సులను రూపొందించుట, ముఖ్యమైన విద్యా సంబంధిత విషయాలను విద్యార్థులకు సదా అందుబాటులో ఉంచే విధానాలు, పరిశోధనలు, వాటి ప్రచురణాలు వంటి అంశాలపై ఆన్‌లైన్ ద్వారా వివరించారు. ఇన్ఫ్లిబ్ నెట్లో విశ్వవ్యాప్తంగా జరిగే అధునాతన పరిశోధనలను అందుబాటులోకి తెచ్చిందని, వీటి ద్వారా అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ విద్యార్థులకు బోధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి, డైరెక్టర్ మిర్యాల రమేష్, డాక్టర్ శ్వేత, డాక్టర్ శ్రీలక్ష్మీ, డాక్టర్ మచ్చేందర్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలవాలి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడా జట్లు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొమరభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్లు విజేతలుగా నిలవాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి బయన్న కోరారు. గురువారం క్రీడా జట్లకు యూనిఫాం, క్రీడా మెటీరియల్స్ అందజేసి మాట్లాడారు. పురుషుల, మహిళల జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. . ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి బయన్న, ప్రసాద్, శంకర్, అలీం, ఆసద్, ఉమామహేశ్వర్, కోచ్‌లు పాల్గొన్నారు.



డెడ్ స్టోరేజీకి చేరువలో బీ.వెల్లెంల రిజర్వాయర్

డెడ్ స్టోరేజీకి బీ.వెల్లెంల రిజర్వాయర్

నార్కట్‌పల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వారం రోజులుగా భారీ వర్షాలు కురిసి చిన్నచిన్న కుంటలు చెరువులు జలకళను సంతరించుకుంటుంటే నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ఓ వైపు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 26 క్రస్టు గేట్లను ఎత్తి కృష్ణానీటిని దిగువకు విడుదల చేసే బదులుగా, రిజర్వాయర్‌లు నింపి రిజర్వాయర్‌ల ద్వారా చెరువులను ఎందుకు నింపడం లేదని ప్రాజెక్టు సందర్శనకు వస్తున్న రైతులు ప్రశ్నిస్తున్నారు. డెడ్ స్టోరేజీకి చేరువలో ఉన్న రిజర్వాయర్‌ను చూసి రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రిజర్వాయర్ నుంచి కాలువలకు విడుదలవుతున్న నీటి పరిమాణం కూడా రోజురోజు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం 290.7 మీటర్ల లోతులో మాత్రమే నీటి నిల్వ ఉంది. కనీసం ఇంతకన్నా ఇంకా ఒక్క మీటరు కిందకు తగ్గినా కాల్వలకు నీటి విడుదల సాధ్యం కాదని, కనీసం 291.7 మీటర్ల లెవెల్ ఉంటే కాలువలకు నీటి విడుదలచేయడం సాధ్యమవుతుందని ప్రాజెక్టు ఇంజనీర్లు చెబుతున్నారు.

రివిట్‌మెంట్ సమస్యే కారణం?

బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్‌కు పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి టన్నెల్ ద్వారా నీరు చేరనుంది. అదేవిధంగా పానగల్ ఉదయ సముద్రానికి కూడా ఎస్‌ఎల్‌బీసీ కాలువ నుంచి నీరు వస్తోంది. అయితే పానగల్ ఉదయ సముద్రం ప్రాజెక్టు కట్టకు ఓ చోట రివిట్‌మెంట్ కూలడంతో మరమ్మతులు చేసేంత వరకు నీటి అడుగుల నిల్వ సామర్థ్యం పెంచడానికి అవకాశం లేదని అధికారులు తెలిపారు. పానగల్ ప్రాజెక్టులో ఇపుడున్న నీటి మట్టానికి బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు టన్నెల్ ద్వారా నీరు విడుదల చేయడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో రైతులు సాగు నీటి అవసరాలు, గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం బీ.వెల్లెంల రిజర్వాయర్ నీటిని కుడి ఎడమల కాలువల ద్వారా విడుదల చేయగా పానగల్ ప్రాజెక్టు నుండి బీ.వెల్లెంలకు నీటి రాక ఆగిపోయిన కారణంగానే భారీ వర్షాలు కురుస్తున్నా బీ.వెల్లెంల రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

'పులిచింతల'కు భారీగా వరద



చింతలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదల కారణంగా కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో 4,28,121, ఔట్‌ఫ్లో 4,31,175 లక్షల క్యూసెక్కులు కొనసాగుతోంది.

● బుగ్గమాదారం - జగ్గయ్యపేట రహదారిలో నిలిచిన రాకపోకలు

దీంతో పులిచింతల ప్రాజెక్టు 13 గేట్లు 4.5మీటర్లు, ఒక్క గేటు 2.5 మీటర్ల మేర ఎత్తి, నీటిని దిగువకు విడుదల చేయడంతో వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. దీంతో బుగ్గమాదారం నుంచి జగ్గయ్యపేట రహదారిలో నాలుగు మీటర్ల మేర నీరు నిల్వ ఉండటంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వజినేపల్లి, బుగ్గమాదారం గ్రామాల్లో లోతట్టు భూముల్లో సాగు చేసి పత్తి, పంట మిర్చి పైర్లు నీట మునిగాయి. పులిచింతల ప్రాజెక్టు జలాశయానికి ఇన్‌ఫ్లో 4,28,115 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 4,32,175 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 165.183 అడుగులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 45.77 టీఎంసీలుగా ఉంది. నదిలో ప్రస్తుతం 31.8797టీఎంసీలు నీటి నిల్వ ఉంది. . తెలంగాణ ఎడమ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

సాగర్, మూసీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి 4,32,065 క్యూసెక్కులనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెకు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 583.10 అడుగులుగా (291.9562టీఎంసీలు)నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,019 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,401 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 32,683 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్ల నుంచి 3,81,262 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 4,32,065 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 4,32,065 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి వరద తగ్గుముఖం.. 6గేట్లు ఎత్తి నీటి విడుదల

కేతేపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో మూసీ రిజర్వాయర్‌కు వచ్చే ఇన్‌ఫ్లో తగ్గింది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 13రోజులుగా మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం 8059.56క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి కొంత మేర తగ్గి 6835.84క్యూసెక్కులుగా నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు నీటిమట్టం 642.37అడుగులకు పడిపోయింది. దీంతో డ్యాం ఇంజనీరింగ్ అధికారులు క్రమంగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ఠ స్థాయికి చేర్చుతూ ప్రాజెక్టు 2, 3, 4, 7, 8, 10 నెంబరు క్రస్టు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 5949.26క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 117.67క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.40అడుగులు (3.79టీఎంసీలు)గా ఉంది.



అలుగునూరు పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

నూతనకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని అలుగునూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఉప్పు నాగయ్య తెలిపారు. గురువారం నూతనకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి, అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను, పరిశ్రమిస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 51పాఠశాలలను ఎంపిక చేస్తూ వాటి విజయ గాథలను ట్రయల్ బ్రేజర్స్ అనే పుస్తకంగా ఎస్సీఈఆర్టీ విడుదల చేసిందన్నారు. వాటిల్లో తమ పాఠశాల రెండో స్థానంలో ఉండడం అభినందనీయమని అన్నారు. ఎంపిక కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు.

అర్వపల్లి లక్ష్మీనృసింహుడికి ఒడిబియ్యం

నకిరేకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అర్వపల్లిలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి, రాజరాజేశ్వరి దేవాలయానికి పట్టణానికి చెందిన మహిళలు ఒడిబియ్యం తీసుకెళ్లారు. గురువారం నకిరేకల్‌కు చెందిన పొనుగోటి శ్రీనివాసరావు లక్ష్మి ఇంటి నుంచి ఒడిబియ్యంతో పాటు పాటు పసుపు, కుంకుమ, గాజులు, పూలు తీసుకెళ్లి స్వామి వారికి సమర్పించినట్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మదేవర పద్మ, రావిరాల కవిత, చల్లా రమ, వెంకటలక్ష్మి, లక్ష్మి, సరిత, మాలతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కడీలను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రామాలయానికి చెందిన స్థలం చుట్టూ వేసిన కడీలను కూల్చిన బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అవురవాణి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కడీలను కూల్చి స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు వెంకటయ్య, మల్లేష్, కర్రెయ్య, బాలరాజు, రోశయ్య, సైదులు, వెంకన్న, స్వామి, సుమన్, కృష్ణ పాల్గొన్నారు.

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదం

(నార్కట్‌పల్లి, ఆంధ్రజ్యోతి)

రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. నార్కట్‌పల్లి మండల కేంద్రం నుంచి అమ్మనబోలుకు వెళ్లే రోడ్డులో ఓ రైతుకు చెందిన భూమికి ఎదురుగా రోడ్డు పక్కనే ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. నార్కట్‌పల్లి-అమ్మనబోలు రోడ్డు విస్తరణలో భాగంగా ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న ప్రదేశం వద్ద రోడ్డు ఎత్తు పెరిగింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ మొత్తం కిందకై విద్యుత్ తీగలు కూడా చేతికి అందేలా ఉన్నాయి. దీంతో ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది. పచ్చిగడ్డిని మేసేందుకు వచ్చే మూగజీవాలకు ఇది తెలియక ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగలకు తగిలితే విద్యుదాఘాతంతో మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఎలాంటి ప్రమాదం జరగకముందే సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలి. లేదా మూగజీవాలకు అందకుండా దిమ్మె ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



అమ్మనబోలు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అలంకారప్రాయంగా హైమాక్స్ లైట్లు

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలోని కురుమర్తి రోడ్డులో ఉన్న చౌరస్తా వద్ద హైమాక్స్ లైట్లు అలంకారప్రాయంగా మిగిలాయి. ఐదేళ్లుగా అలంకారంప్రాయంగానే మారాయి. దీంతో ఈ ప్రాంతం అంధకారంలో మగ్గుతుంది. నిత్యం రద్దీతో ఉండే ఈ రహదారిలో రాత్రి సమయంలో లైట్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ చౌరస్తాలో పదేళ్ల క్రితం హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. అప్పుడు ఈ ప్రాంతం రాత్రి వేళలో పండువెన్నెలగా ఉండేది. ఐదేళ్ల నుంచి లైట్లు ఖాళీపోవడంతో వాటికి మరమ్మతులు చేయకపోవడంతో రాత్రిపూట అంధకారంలో మగ్గుతుంది. అధికారులు స్పందించి ఇక్కడ ఉన్న టవర్‌కు వెంటనే హైమాక్స్ లైట్లు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకారంలోని కురుమర్తి రోడ్డు చౌరస్తాలో లై ట్లు లేక రాత్రి సమయంలో బ యట వెళ్లాలం టే భయంగా ఉంది. హైమా క్స్ లైట్లు అలంకార ప్రాయంగా మారడం తో ఇబ్బంది లు పడుతు న్నామని గ్రామానికి చెందిన జువాజీ నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. వెంటనే అధికారులు స్పందించి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలి.



ఆకారం గ్రామంలో హైమాక్స్ లైట్ల టవర్

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి : సీపీఎం

నల్లగొండ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన అధ్యయన యాత్రలో భాగంగా గురువారం పట్టణంలోని ఎఫ్‌సీఐ, తాళ్లబజార్, ఓం సాయికాలనీ, ద్వారకానగర్ కాలనీ, ముత్యాలమ్మ గుడి ఏరియాతో పాటు తదితర ప్రాంతాలను సందర్శించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారడంతో కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మురికినీరు రోడ్లపై పారడంతో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించని యెడల సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యురాలు తుమ్మల పద్మ, నాయకులు పాత లింగయ్య, నర్సింహ, సైదాచారి, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని డ్రైనేజీలను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

గట్టుప్పల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌ను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు చేస్తున్న వంటలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవన పనులను పరిశీలించారు. గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్ -1 ను తనిఖీ చేసి మందుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి మండల వ్యవసాయ అధికారితో కలిసి ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసి యూరియా నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సమస్య ఉత్పన్నమవకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం మండల పరిధిలోని నామాపురం జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల సిబ్బంది, విద్యార్థుల హాజరును మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.మాధవరెడ్డి, ఏవో ఎం.రేవతి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాజశేఖర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

జహీరుద్దీన్, తహసీల్దార్



కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ షేక్ జహీరుద్దీన్ అన్నారు. వర్షాలకు ఇళ్లు కూలిపోవడం, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు, వరద ప్రమాదంగా ఉన్న గ్రామాల గురించి తమకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: వర్షాలకు ఏఏ ప్రాంతాలు దెబ్బతిన్నాయి?

తహసీల్దార్: మండలంలోని ఊట్కూరు నుంచి బండమీదిగూడెం గ్రామాల మధ్యనున్న పూర్తిగా దెబ్బతిన్నది. పావురాలగూడెం, ఊట్కూరు గ్రామాల మధ్యనున్న కాజ్‌వే పై వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. పలు గ్రామాల అంతర్గత రహదారులు కూడా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అధికారులకు నివేదించాం.

ఆంధ్రజ్యోతి: వర్షాలకు ఎన్ని ఇల్లు దెబ్బతిన్నాయి?

తహసీల్దార్: కురుస్తున్న వర్షాలకు మండలంలో 3 ఇళ్లు కూలిపోగా 10 వరకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇల్లు కూలిన బాధితులు తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి.

ఆంధ్రజ్యోతి: మండలంలో కాజ్‌వేలపై ప్రమాదంగా నీరు ప్రవహిస్తుందా... ప్రవహిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: మండలంలో శాలిగౌరారం నుంచి ఊట్కూరు వెళ్లే రోడ్డు కాజ్‌వేలో వరద నీరు ప్రమాదభరితంగా ప్రవహిస్తుంది. రామాంజపురం - అమ్మనబోలు రోడ్డు మార్గంలో కూడా అధిక వర్షాలు వచ్చినపుడు జాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద నీటిలో ప్రజలు ప్రయాణం చేయడం మంచిది కాదు. భారీ వర్షాలు కురిసేటప్పుడు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల వద్ద నుంచి ఎన్ని అర్జీలు వచ్చాయి?

తహసీల్దార్: రెవెన్యూ సదస్సులో రైతుల వద్ద నుంచి 2270 అర్జీలు వచ్చాయి.

గ్రామదేవతలకు వైభవంగా బోనాలు

మర్రిగూడ, నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, కనగల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో గురువారం గ్రామదేవతలకు బోనాల కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారులు బోనాలను తయారు చేసి నైవేద్యంతో నెత్తిన బోనం ఎత్తుకుని అంతా కలిసి ప్రదర్శనగా దేవతామూర్తులకు అర్పించి నైవేద్యాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద దేవతామూర్తులకు అర్పించి నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామ దేవతలకు పాటు ధూప దీప నైవేద్యాలను అర్పించి పాడి పరిశ్రమ కుటుంబం చల్లగా ఉండాలంటూ మొక్కుబడులను తీర్చుకున్నారు. అంటురోగాలు సోకకుండా గ్రామాన్ని చల్లగా చూడాలని మొక్కుకున్నారు. ఆయురారోగ్యాలను ప్రసాదించాలని వేడుకున్నారు.

● మర్రిగూడెం మండల కేంద్రంలో దళితవాడలో ముత్యాలమ్మ తల్లి, నేటి చందాపురం, ఇందుర్తి, పొట్టిపిల్లి, బీమనపల్లి, కొండూరు గ్రామాల్లో మహిళలు బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.

● నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మానిలో శ్రావణమాసం పురస్కరించుకుని ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో అలుగుబెల్లి ఉపేందర్‌రెడ్డి, బానాల వెంకట్‌రెడ్డి, యేళ్ల రఘుపతిరెడ్డి, ఈదునూరు ప్రతాప్‌రెడ్డి, బుర్రి వీరయ్య, సత్తయ్య, నర్సింహ, వెంకన్న పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని వట్టిమర్తి, నేరడ గ్రామాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. వట్టిమర్తిలో గౌడ కంఠమహేశ్వరస్వామి ఆలయం వద్దకు ప్రదర్శనగా వెళ్లారు. నేరడ గ్రామంలో రజకుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మహిళలు ఆనందోత్సాహలతో నృత్యాలు చేస్తే సందడి చేశారు.

● కనగల్ మండలంలోని తేలకంటిగూడెంలో ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. తొలుత బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు జరిపి దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోగరి రాంబాబు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల మండలం వట్టిమర్తిలో బోనాల ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు, గ్రామస్థులు

గోపలాయపల్లి గుట్టపై ఘనంగా శివకల్యాణం

నార్కట్‌పల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలో గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం గుట్టపై ఉన్న పార్వతీ రామలింగేశ్వరుల కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ఉత్సవంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు ఈవో చిట్టెడి వెంకట్‌రెడ్డి భక్తులు యాదగిరిరావు చంద్రకళ, శ్రీహరి, దోనపాటి విష్ణుమూర్తి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మండలంలోని మాండ్ర-కక్కిరేణి గ్రామాల శివారులోని అనంత స్వర్ణగిరి వద్ద ఉన్న శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో మహాలక్ష్మి నారాయణస్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఉండ్ర లింగారెడ్డి భాగ్యమ్మ దంపతులు, మాండ్ర, చిన్నతుమ్మలగూడెం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

(5వపేజీ తరువాయి)

వద్ద ఉన్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా 1000 మెట్రిక్ టన్ను ల నిల్వలుండగా, మరో 500 మెట్రిక్ టన్నులు గురువారంరాత్రి జిల్లాకు చేరుకోనుంది. 23 లేదా 24 తేదీల్లో మరో 1000 మెట్రిక్ టన్నులు జిల్లాకు దిగుమతి కానుంది. కలెక్టర్ ఇలాత్రిపాఠి నిరంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ రైతుల ఇబ్బందులు తొలగించేందుకు క్రమక్రమంగా యూరియాను తెప్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాకు మరో 25వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం

వానాకాలం సీజన్‌లో జూన్‌నుంచి సెప్టెంబరు వరకు అంటే నాలు గు నెలలపాటు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. ఆగస్టు మూడోవారం వచ్చే సరికి 45వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి, వరి పంట విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో పత్తి విస్తీర్ణం 5.70లక్షల ఎకరాల వరకు పెరగగా, వరి ఇప్పటివరకే 3.50లక్షల వరకు సాగైంది. మరో లక్షన్నర ఎకరాల్లో ఈ నెలాఖరులోగా నాట్లు పడనున్నాయి. ఇప్పటికే 45వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరినందున సెప్టెంబరు నెలాఖరు వరకు మరో 25వేల మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి చేయాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా 5వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు కోటా వస్తే అందులో నుంచి యూరియా జిల్లాకు 4వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద వరి విస్తీర్ణం పెరగడంతోపాటు బోరు బావుల కింద కూడా వరిసాగు ముమ్మరం కావడంతో యూరియా అవసరాలు పెరిగాయి. దీనికితోడు జిల్లాలో జూలై నెలలోనే అత్యధికంగా అవసరానికి మించి యూరియాను రైతులు నిల్వ చేసుకున్నట్లు సమాచారం. దీంతోనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని వ్యవసాయశాఖ భావిస్తుంది.

మరో నాలుగైదు రోజులపాటు అరకొరే..

జిల్లావ్యాప్తంగా మరో నాలుగైదు రోజులపాటు యూరియా అరకొరగానే సరఫరా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో యూరియా అవసరం ఉన్న రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాలు మాత్రమే ఇవ్వనున్నారు. అయితే కొన్నిచోట్ల ఒకే కుటుంబానికి చెందిన వారు తమ ఆధార్ కార్డుల ద్వారా అధికంగా యూరియాను తీసుకునే అవకాశాలున్నాయని అధికారులు భావించి అవసరం ఉన్న వారికే యూరియాను విక్రయించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. దీనికితోడు అధిక ధరలకు యూరియాను విక్రయించకుండా డీలర్లపై వ్యవసాయ శాఖ నిఘా పెట్టింది. గత రెండున్నర నెలలుగా ఎమ్మార్పీ ధరలు అంటే గరిష్ఠ రిటైల్ ధరకు మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నిచోట్ల ఎరువుల వ్యాపారులు యూరియా బస్తాలు కావాలంటే ఇతర ఎరువులు కొనుగోలు చేయాలని లింక్ పెట్టడంతో దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియాకు ప్రత్యమ్నాయంగా నానో యూరియా కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఈ లిక్విడ్ నానో యూరియా కూడా యూరియాతో సమానంగా పంటల దిగుబడి వచ్చేలా పనిచేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే రైతుల్లో ఇంకా అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. మొత్తానికి మరో నాలుగైదు రోజులపాటు యూరియా కొరత ఉండే పరిస్థితుల్లో సమస్యను ఏ విధంగా వ్యవసాయ శాఖ అధిగమిస్తుందో వేచి చూడాల్సిందే.

అవసరాలకు అనుగుణంగా యూరియా

జిల్లాలో ఒక గురువారంనాడే 5వేల మంది రైతులకు 1000 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీచేశాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఇలా త్రిపాఠి నిరంతరం సమీక్ష చేస్తూ వ్యవసాయశాఖకు తగిన ఆదేశాలు, సూచనలు ఇస్తూ ఎరువుల కొరత లేకుండా మానిటరింగ్ చేస్తున్నాం. యూరియాకోసం రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు. యూరియా అవసరం ఉన్న రైతులు మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ నెలాఖరులోగా మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుంది.

- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

బీజేపీ వల్లే రాష్ట్రంలో యూరియా కొరత

శాలిగౌరారం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ ఆరోపించారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన 9.80లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఇవ్వకుండా కేవలం 5.32లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడమే కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ధర్నా, ఆందోళన చేస్తేనే 50వేల మెట్రిక్ టన్నుల యూరియాను తక్షణమే సరఫరా చేస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. వెంటనే తెలంగాణకు యూరియా కొరత లేకుండా కేంద్రప్రభుత్వం సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యూరియా దారి మళ్లింపుపై విచారణ చేయాలి

చిట్యాలరూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కేంద్రం సరఫరా చేస్తున్న యూరియా దారిమళ్లింపుపై విచారణ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల వెంకటనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన గుండ్రాంపల్లికి చెందిన మైల నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు పీక వెంకన్నను గురువారం వెంకటనారాయణ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు పడకుండా కేంద్రం యూరియా సరఫరా చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్‌లోని మిగులు నిల్వలకు లెక్కలు చెప్పకుండా, యూరియాను దారి మళ్లించిందని ఆరోపించారు. ప్రభుత్వం యూరియా సరఫరాపై కేంద్రానికి ముందస్తు అంచనా నివేదికలు ఇవ్వకుండా కొరత సమస్యలను కేంద్రంపై రుద్దుతూ నిందిలు వేస్తుందని ఆరోపించారు. యూరియాపై కేంద్రం రాష్ట్రానికి రూ.70లక్షల కోట్ల రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులకు సరిపడా యూరియాను చేయకపోవతే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై మండలాల్లో ఈ నెల 21 నుంచి 25 వ తేదీ వరకు నిర్వహించే ర్యాలీలు, ధర్నా కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మార్వాడీ హఠావో కోసం నేడు దుకాణాల బంద్

నల్లగొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మార్వాడీ హఠావో తెలంగాణ బచావో కోసం శుక్రవారం జిల్లా వ్యాప్తంగా దుకాణాల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దైద రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్వాడీలు నకిలీ వస్తువులను తీసుకవచ్చి ప్రజలను మోసం చేయడమే కాకుండా నిరుద్యోగుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. మొబైల్ షాపులతో పాటు, శానిటరీ, ఎలక్ట్రికల్, ఇతర అనుబంధ దుకాణాలన్నింటినీ స్వచ్ఛందంగా బంద్ పాటించి సహకరించాలని కోరారు. మార్వాడీ హఠావో కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. బంద్‌లో భాగంగా కిరాణ అసోసియేషన్, ఎలక్ట్రికల్స్, హార్డ్‌వేర్ అసోసియేషన్, వస్త్ర దుకాణాలు, స్టీల్ సిమెంట్ అసోసియేషన్, స్వర్ణకారులు, చెప్పుల దుకాణం, హేయిర్ సెలూన్ రెడీమేడ్ దుకాణాలు, అన్ని వ్యాపార సముదాయాలు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

● నార్కట్‌పల్లి: స్థానిక వ్యాపారులపై మార్వాడీ వ్యాపారుల దాడులను నిరసిస్తూ మార్వాడీ గో బ్యాక్ నినాదంతో శుక్రవారం బంద్‌కు పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన స్థానిక వ్యాపారస్థులు గురువారం ప్రతీ షాపునకు తిరిగి బంద్‌ను విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో నార్కట్‌పల్లి వృత్తి వ్యాపార వర్తక సంఘాల అధ్యక్షుడు బోడ వెంకన్న ఉపాధ్యక్షుడు కొప్పు అంజన్ కుమార్, సహాయ, ప్రధాన కార్యదర్శులు పసునూరి శివరాం, బోయపల్లి శ్రవణ్‌కుమార్, సభ్యులు నాగరాజు, సత్యం, బిక్షమయ్య, సంతోశ్, దశరథ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంలో ఇద్దరికి డాక్టరేట్

నల్లగొండరూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో నల్లగొండ జిల్లాలోని నర్సింగ్‌బట్ల గ్రామానికి చెందిన పెరికె నాగరాజు డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగరామ్ డాక్టరేట్ పట్టాను అందజేశారు. డాక్టర్ ఎస్‌జేపీ సుభాషిణి పర్యవేక్షణలో సింథసిస్, యాంటీ క్యాన్సర్ యాక్టివిటీ హ్యాండ్ మాలిక్యూలర్ డాకింగ్ స్టడీస్, ఇతర అంశాలపై చేసిన పరిశోధనకు ఆయన డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. డాక్టరేట్ సాధించిన నాగరాజును ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు బల్లెం ప్రవీణ్‌కుమార్, విశ్వశాంతి యూత్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



నాగరాజు

● తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న డి.శివలీల డాక్టరేట్ అందుకున్నారు. ఓయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రిపరేషన్ ఆఫ్ మెటల్ కాంప్లెక్స్‌లో పలు అంశాలపై ప్రొఫెసర్ గ్యానకుమారి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ అందజేశారు. డాక్టరేట్ పొందిన శివలీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, ఇతర అధ్యాపకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.



డి.శివలీల

యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు, కట్టంగూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): యువ వికాసం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. జిల్లాలోని మునుగోడు, కట్టంగూరు మండలాలలోని పలు పాఠశాలల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కృషి, పట్టుదల క్రమశిక్షణతో లక్ష్యం సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విద్యార్థులను ప్రోత్సహిస్తున్న లయన్స్ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు.



మునుగోడు: యువ వికాసంలో మాట్లాడుతున్న లయన్ పాలకూరి నరసింహగౌడ్

● మునుగోడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు మహాత్మా జ్యోతిబాపూలే (ఎంజేపీ) బాలికల గురుకుల పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మోటివేషనల్ స్పీకర్స్ లయన్ పూర్ణ శశికాంత్, లయన్ దీపిక, క్లబ్ జిల్లా చైర్మన్ యర్రమాద శ్రీనివాస్, లయన్స్ క్లబ్ మునుగోడు కార్యదర్శి పాలకూరి నరసింహగౌడ్, ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకటేశ్వర్లు సభ్యులు మిర్యాల వెంకటేశం, మిర్యాల శ్రీనివాస్, కుమారస్వామి, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


● కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నల్లగొండ లయన్స్ డైమండ్ క్లబ్ ఆధ్వర్యంలో యువ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంఈవో అంజయ్య అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, లయన్స్ డైమండ్ క్లబ్ సెక్రటరీ జానకిరెడ్డి, క్లబ్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బత్తాయి ధర..ఢమాల్ !

(5వపేజీ తరువాయి)

ముంబై, చెన్నై మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాల్లో బత్తాయిల సాగు ఎక్కువవడంతో చెన్నై, బెంగళూరు మార్కెట్లకు ఇక్కడినుంచి బత్తాయి వెళ్లడం లేదు. మహారాష్ట్రలోనూ నాందేడ్ పరిసర జిల్లాల్లో బత్తాయిల సాగు పెరిగింది. దీంతో ముంబై మార్కెట్లోనూ పోటీ పెరిగి మన కాయకు డిమాండ్ తగ్గిందని చెబుతున్నారు. దీంతో హైదరాబాద్‌తో పాటు ఉత్తర భారతదేశ మార్కెట్‌లే నల్లగొండ బత్తాయిలకు పరిమితమవగా, అక్కడ భారీ వర్షాల నేపథ్యంలో ఈసారి డిమాండ్ తగ్గింది. దీనికితోడు ప్రధానంగా బత్తాయికి నిల్వ సామర్థ్యం లేకపోవడం, పండ్ల రూపంలో గరిష్ఠంగా పది రోజులకు మించి నిల్వ ఉంటే చేదుగా మారుతుండటం, జ్యూస్ రూపంలోకి మార్చాక కనీసం రెండు, మూడు రోజులపాటు కూడా ఉండని పరిస్థితి నెలకొంది. ఇవి బత్తాయి సాగుకు పెద్ద ఆటంకంగా మారింది. బత్తాయి సాగను ఒక దశలో ప్రత్యామ్నాయ పంటగా ప్రభుత్వం ప్రోత్సహించినా శాశ్వతంగా దానిని కొనసాగించేందుకు అవసరమైన సాంకేతికత వృద్ధి, పరిశోధనలపై ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో దళారులు చెప్పిందే వేదంగా మారింది. దీంతో బత్తాయి సాగు రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో క్రమంగా నీటివనరులు ఉన్న రైతాంగం బత్తాయి స్థానంలో వరి సాగుకు మారుతుండటంతో జిల్లాలో సాగు విస్తీర్ణం పడిపోయింది.

కాయలు చెట్లమీదనే రాలిపోతున్నాయి



నేను రెండు ఎకరాల్లో బత్తాయి సాగు చేశాను. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారులు టన్ను కు రూ.12 వేలే ఇస్తామంటున్నారు. మేము ఆ ధరకు ఇవ్వలేకపోతున్నాం. చెట్లమీదనే కాయలు రాలిపోతున్నాయి. బత్తాయి సాగు చేసే రైతుల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించి ఆదుకునే చర్యలు చేపట్టాలి.

- తగుళ్ల సర్వయ్యయాదవ్, గుర్రంపోడు

ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి



బత్తాయి రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు. దళారుల చేతిలో బతుకైపోయింది. టన్నుకు రూ.13 నుంచి 15వేలకు మించి ధర ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడులు రాని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించి కనీస మద్దతు ప్రకటించాలి. లేకపోతే జిల్లాలో బత్తాయి తోటల సాగు కనుమరగయ్యే ప్రమాదం నెలకొంది.

- సీతారాంరెడ్డి, అంగడి పేట, పీఏపల్లి మండలం

బత్తాయికి ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి



బత్తాయి పండ్లకు మార్కెట్ లేకపోవడంతో ధర పూర్తిగా పడిపోయింది. పెట్టుబడులు కూడా రావడం కష్టమైన పరిస్థితి నెలకొంది. చాలా ఇబ్బందులు పడి బత్తాయి తోటలు సాగుచేస్తే పంట చేతికొచ్చాక ధర రాక నష్టపోవాల్సి వస్తోంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. మార్కెట్‌ను నియంత్రించి రైతులకు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- మల్లికార్జున్, రైతు, హాలియా

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583.10 (291.9562)	4,32,065	4,32,065
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.40 (3.79)	6835.84	6125.5
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	165.183 (31.8797)	4,28,115	4,32,175

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220



ఎగుమతికి సిద్ధంగా ఉన్న బత్తాయిలు

దిగుబడి వచ్చే సీజన్‌లో ధర తగ్గిపోవడంతో బత్తాయి రైతులు దిగాలు పడుతున్నారు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం, దళారులపై ఆధారపడటంతో వారు చెప్పిన ధరకే బత్తాయి విక్రయించాల్సి వస్తోంది. ఉత్తరాదిలో వర్షాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

బత్తాయి ధర ఢమాల్!

- టన్ను ధర రూ.10వేల నుంచి రూ.15వేలే
- ధర లేక నష్టపోతున్నామంటోన్న రైతులు
- ఉత్తరాదిలో వర్షాల వల్లే మార్కెట్ డౌన్
- ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దళారీలదే రాజ్యం

ప్రధానంగా బత్తాయి మార్కెట్లు ఉన్న ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, లక్నో, జైపూర్ నగరాల్లో భారీ వర్షాలతో డిమాండ్ తగ్గిందని, ఆ ప్రభావం వల్లే మార్కెట్లో ధర పడిపోయిందని తెలుస్తోంది. రెండేళ్లుగా సీజన్‌లో ఇదే పరిస్థితి నెలకొనడంతో అప్పులపాలవ్వాల్సి వస్తోందని బత్తాయి తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు.బత్తాయిలు నిల్వ చేయడానికి గానీ, లేదా ప్రభుత్వం నుంచి మద్దతు ధర ఇచ్చే అవకాశం కానీ లేకపోవడంతో వచ్చిన ధరకు పంట విక్రయించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

రూ.15వేలకు లోబడే ధర

నల్లగొండ జిల్లాలో పండించిన బత్తాయిలను ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల ప్రాంతానికి చెందిన వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోళ్లు చేస్తారు. సాధారణంగా ఈ సీజన్‌లో టన్నుకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుంది. ఈ ధర దక్కితే రైతులకు నష్టాలు లేకుండా ఎంతో కొంత ఆర్థికంగా లాభం దక్కుతుందని, వరుసగా రెండేళ్లనుంచి ఈ పరిస్థితి కరువైందని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో తోటల వద్ద కొనుగోలు చేసే బత్తాయిలకు మెట్రిక్ టన్నుకు రూ.12వేల నుంచి గరిష్ఠంగా రూ.15వేల వరకు చెల్లిస్తున్నారు. పైగా లోడింగ్ సందర్భంగా టన్నుకు క్వింటా వరకు తరుగు తీస్తున్నారని, తక్షణం చెల్లిస్తే ఐదు శాతం వరకు మొత్తంలో కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. పదేళ్ల లోపు తోటల్లో కాయలకు గరిష్ఠంగా టన్నుకు రూ.15వేల వరకు ధర దక్కుతుంటే, అంతకు మించి వయసున్న తోటల్లో పండిన కాయలకు టన్నుకు రూ.10వేల నుంచి రూ.12వేలకు మించి ధర ఇవ్వడం లేదు. ఈ తోటల్లో పండే కాయల్లో నాణ్యత తగ్గుతుందని, మెరుపుదనం ఉండదని దళారులు చెబుతున్నారని, చివరకు వారు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో బత్తాయి మార్కెట్ నల్లగొండలో ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ లావాదేవీలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాక బత్తాయి మార్కెట్‌పై ప్రభుత్వానికి, ఉద్యానశాఖకు ఎలాంటి అజమాయిషీ లేకపోవడం వల్లే దళారులు అడిగిన ధరకు ఇవ్వాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. కనీసం పంట నష్టపోతే బీమా సదుపాయం కూడా బత్తాయికి లేదని, ఎలాంటి పంట నష్టం వర్తించదని, ఏ ప్రభుత్వం వచ్చినా బత్తాయి రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సాగును తగ్గిస్తోన్న రైతాంగం

మార్కెటింగ్ ఇబ్బందులు, నిల్వ చేసే పరిస్థితి లేకపోవడం వంటి కారణాలకు తోడు, వరి సాగు సులభతరం కావడంతో జిల్లాలో బత్తాయి సాగుని రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. జిల్లాలో 2010 వరకు దాదాపు 3.10లక్షల ఎకరాల బత్తాయితోటలు ఉంటే, ప్రస్తుతం అది కాస్త 45 వేల ఎకరాలకు లోబడి పడిపోవడం తీవ్రతను తెలియజేస్తోంది. జిల్లాలో పండే బత్తాయిలను హైదరాబాద్‌తో పాటు, ఢిల్లీ, లక్నో, జైపూర్..

- మిగతా 8వ పేజీలో...

మార్కెట్‌కు తీసుకువస్తే కొనుగోలుకు ఆదేశిస్తాం..

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీ కాలనీలో బత్తాయి మార్కెట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఇక్కడ విక్రయించేందుకు రైతులు బత్తాయిలు తీసుకురావడం లేదు. రైతులు గ్రామాల్లో నేరుగా కాయలను విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు రైతులు పంట తెస్తే కొనేందు కు వ్యాపారులను ఆదేశిస్తాం. ఇతర రాష్ట్రాల్లో ధర రావడం లే దనేది మాపరిధిలోని అంశం కాదు.

- ఛాయాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

- రైతులకు ఇబ్బందుల్లేకుండా టోకెన్లు
- మరో నాలుగైదు రోజులపాటు ఇదే పరిస్థితి





అనుముల మండలం కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

జిల్లాలో పోలీస్ పహారా నడుమ యూరియా పంపిణీ చేస్తున్నారు. బుధవారం తిప్పర్తిలో మొదలైన యూరియా తిప్పలు జిల్లాలో ఇతర ప్రాంతాలకు సైతం క్రమక్రమంగా పాకాయి. గురువారం నల్లగొండ జిల్లాలో యూరియా కొరత తీవ్రంకావడంతో రైతులు పీఏసీఎస్‌లు, ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరారు. రోజురోజుకు యూరియా కోసం రైతులు ఎగబడటం అధికమవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

రైతులకు ముందుగా టోకెన్లు ఇచ్చి ఆ తర్వాత యూరియా ఇస్తున్నారు. ప్రతీ రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా ఇస్తున్నారు. మరో నాలుగైదు రోజులపాటు ఇదే పరిస్థితి నెలకొననుంది. గురువారం నాడు అనుముల మండలం కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. నార్కట్‌పల్లి, కట్టంగూరు, తిప్పర్తి మండలాల్లో పోలీసుల సమక్షంలోనే యూరియా పంపిణీ చేశారు. 520 టన్నుల యూరియాను 5వేల మంది రైతులకు గురువారం పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పోలీసులు సమన్వయం చేయడానికి మాత్రమే ఆయాకేంద్రాల..

- మిగతా 8వ పేజీలో...

ఎరువుల కోసం బారులు

- జిల్లాలో యూరియా ఇక్కట్లు
- గంటల వ్యవధిలోనే ఎరువులు ఖాళీ
- పాస్ పుస్తకానికి మూడే బస్తాలు

•7లో

సరిపడా యూరియా ఇవ్వకపోతే పోరాటమే

ఇద్దరు మంత్రులు ఉన్నా ఒక్క సమీక్ష చేయలేదు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్ తదితరులు

నల్లగొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా యూరియా కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉండి కూడా ఒక్క సమీక్ష చేయలేదని, వారం రోజుల్లో సరిపడా యూరియా ఇవ్వకపోతే రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరత రాబోయే రోజుల్లో తీవ్రమయ్యే అవకాశాలున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. రైతులు నిద్రహారాలు మాని లైన్లలో చెప్పులు పెట్టుకొని అవస్థలు పడుతున్నారని, ఎకరానికి రూ.20వేల పెట్టుబడి పెట్టి ఒక్క బస్తా యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలో వేసవిలోనే గోదాంలలో ఎరువులు నిల్వ చేసేవాళ్లమన్నారు. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ చేసేవాళ్లమని, ప్రస్తుత ప్రభుత్వంలో సమీక్షలే జరగలేదన్నారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం విక్రయించడానికి కూడా ఇబ్బందులు పడ్డారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కమీషన్లపై దృష్టి సారించడం తప్ప రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో సైతం ఈ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోనూ కమీషన్లు తీసుకొని రైతులను గాలికి వదిలేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18నెలల కాలంలో 56 సార్లు ఢిల్లీ వెళ్లాడని, కనీసం ఎరువులు తీసుకరాలేక పోయాడన్నారు. ఎరువుల కోసం కాళ్లు పట్టుకునే దుస్థితికి రైతులను తెచ్చారన్నారు. మంత్రుల తీరు వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రతీరంగంలోనూ తిరోగమనంలో ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సమయంలోనూ హమాలీలు లేకుంటే, హమాలీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేశామని గుర్తుచేశారు. నల్లగొండ నియోజకవర్గంలో దారుణమైన పరిస్థితులున్నా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎక్కడో ఉండి బైపాస్ చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్ యాదవ్, మందడి సైదిరెడ్డి, నిరంజన్ వలీ, మాలె శరణ్యరెడ్డి, మారగోని గణేష్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, చల్లా కోటేష్, బొమ్మరబోయిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతుల బాధలు పట్టించుకోవడంలేదు

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు యూరియా కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని తాటికల్ సింగిల్‌విండో కార్యాలయం వద్ద యూరియాకోసం పడిగాపులు కాస్తున్న రైతులతో ఆయన మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలన్నారు. చంటి పిల్లలతో యూరియా కోసం వచ్చిన మహిళా రైతులు గంటలు తరబడి నిరీక్షిస్తున్నారన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి, హైదరాబాద్‌కు తిరగడం తప్ప రైతుల బాధలు పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండేవారన్నారు. ఆయనవెంట మునిసిపల్ కౌన్సిలర్ పల్లె విజయ్, నాయకులు ప్రగడపు నవీన్‌రావు, గొర్ల వీరయ్య, యానాల లింగారెడ్డి, పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



జిల్లాకేంద్ర ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

● కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై గృహనిర్మాణ శాఖ అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గంలోని మండలాల ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణ ఇంజనీర్లు, ఎంపీడీవోలు ప్రత్యేకశ్రద్ధ వహించి గ్రౌండింగ్‌ను పెంచాలన్నారు. నల్లగొండ మునిసిపాలిటీతోపాటు, కనగల్, తిప్పర్తి మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇసుక సమస్యను తహసీల్దార్లు పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

చిన్నారులపట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

నల్లగొండ టౌన్: సీజనల్ వ్యాధులబారిన పడిన చిన్నారులను ఆస్పత్రికి తీసుకొస్తే, వెంటనే వైద్యం అందించాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని ఆమె గురువారం తనిఖీ చేశారు. పిల్లల వార్డులో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో వ్యాధి నివారణ మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రిలో చేరిన పిల్లలకు సంబంధించి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ కేసుల వివరాలను అడిగారు. ఆమెవెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ కుమారి, చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన, డాక్టర్ నగేష్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ వినోద్



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని, విదేశీ వస్తువులను త్యజించాలని స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కన్వీనర్ వినోద్ హిందుస్తానీ అన్నారు. గురువారం స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అమెరికా, చైనా, టర్కీ మొదలైన విదేశీ వస్తువులను వినియోగించవద్దని, వీలైనంత ఎక్కువగా మన దేశ ఉత్పత్తులనే వాడి, దేశ జీడీపీని పెంచి, ఇక్కడి పరిశ్రమలకు అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంకోసం ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. చైనా వంటి దేశాలు అధిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ఉపయోగించి, అతి తక్కువ ధరలో, నాసిరకం వస్తువులను డంప్‌చేస్తూ, మన తయారీ రంగాన్ని బలహీనపరుస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వదేశీ ఆచరణ మన జాతీయ ప్రయోజనాలను కాపాడే ప్రధాన ఆయుధం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పొట్టిపాక నాగరాజు, ఆవుల సంపత్, అమల, లక్ష్మి, శ్రీదేవి, మౌనేశ్వర్‌చారి, మణికుమార్, హరీష్, బన్నీ, జయంత్, రుత్విక్, లక్ష్మీనివాస్, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు

దామరచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని థర్మల్ ప్లాంట్ పరిసర గ్రామాల ప్రజలు అన్నారు. దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో భూములు కోల్పోయిన స్థానికులకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం పరిశ్రమ గేటు వద్ద సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ చిత్రపటాలకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు కోసం తమ భూములు కోల్పోయామని, గతంలో తమకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయని, అందులో భాగంగా తమకు నియామకపత్రాలు అందించడం హర్షణీయమన్నారు. 335 మందికి ఉద్యోగ పత్రాలు అందించి విధుల్లోకి తీసుకోనున్నారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వస్త్ర మన్నికలో 'రామ్‌రాజ్'దే అగ్రస్థానం

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడలో రామ్‌రాజ్ కాటన్ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వస్త్ర మన్నికలో, నాణ్యతలో రామ్‌రాజ్ కాటన్‌దే అగ్రస్థానమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడలో రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల నూతన షోరూంను ఆయన సతీమణి విజయతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిపుణులతో రూపొందించిన వస్త్రాలనే తయారు చేస్తూ రామ్‌రాజ్ కాటన్ వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల కోసం ఆన్‌లైన్‌లో సైతం వస్త్ర విక్రయాలు కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా ధోతీల విక్రయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఏకైక సంస్థ రామ్‌రాజ్ అన్నారు. మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపక చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ 'గౌరవనీయులు' అనే ముద్రతో విక్రయమవుతున్న రామ్‌రాజ్ కాటన్ దుస్తులు అందాన్ని, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షించడానికి కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ప్రారంభించినట్లు తెలిపారు. రాజీలేని నాణ్యతే కంపెనీని వస్త్ర ప్రేమికులకు చేరువ చేస్తోందన్నారు. ధోతీలలో తొమ్మిది రకాలు, షర్ట్‌లలో 10 రకాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. శ్రీలంక, సింగపూర్, మలేషియా తదితర దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జీ పగిడిమర్రి గోవర్ధనాచారి, మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి శ్యామ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా నిర్మించుకోవాలి

దేవరకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారులు ఇళ్లను వేగవంతంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో డానియెల్ అన్నారు. గురువారం మండలంలోని మర్రిచెట్టుతండాలో నిర్మాణమవుతున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఇళ్లు త్వరగా నిర్మించుకుంటే అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి బిల్లులు ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. ఎంపీడీవో వెంట మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్, మైనంపల్లి పంచాయతీ కార్యదర్శి సాగర్, అధికారులు ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరిని ఎక్కువగా సాగు చేశారని అన్నారు. రైతులకు యూరియా ఎక్కువగా అవసరం ఉన్నందున యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొని సకాలంలో అందించాలని కోరారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి


ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశం

అడవిదేవులపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణదారులు రైతులకు ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయించాలని మండల ప్రత్యేకాధికారి టి.వెంకటేశం అన్నారు. ఆయన మండల కేంద్రంలోని పలు ఎరువులు దుకాణాలకు గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, ఎరువుల స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. ఎరువులను ఈపాస్ మిషన్ ద్వారా విక్రయించాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, పరిశ్రమలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎన్‌డీసీఎంఎస్‌లో మండల రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు అధైర్యపడవద్దని ఆయన సూచించారు. ఆయన వెంట ఏవో జి.సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల గేటుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కళాశాల గేటుకు మరమ్మతు చేస్తున్న వెల్డర్లు

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వార కొండీలు విరిగి గేటు ప్రమాదకరంగా మారింది. ఇరు విద్యాలయాలకు చెందిన విద్యార్థులతో పాటు వందలాది మంది క్రీడాకారులు, వాకర్లు మైదానానికి వస్తుంటారు. కొండీలు విరిగి గేటు ఒరిగిన కారణంగా వారందరూ భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో 'గేటుకు మరమ్మతు చేపట్టరూ..' అనే శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యాలయ యాజమాన్యం, వాకర్స్ క్లబ్ గేటు మరమ్మతులు చేపట్టింది.

బొక్కమంతలపహాడ్‌లో నేడు ఎమ్మెల్యే పర్యటన

నిడమనూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొక్కమంతలపహాడ్ గ్రామంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి శుక్రవారం పర్యటించి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఊరూరా అభివృద్ధి పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్ర భవనం, గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకతి సత్యం కోరారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

వేములపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతాంగానికి యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యవసాయ ప్రణాళిక లేకపోవడంతోనే రైతులకు సకాలంలో యూరియా అందక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో ఆయకట్టు పరిధిలోని రైతులు పూర్తిస్థాయిలో వరి సాగు చేసినట్లు తెలిపారు. నాట్లు వేసి నెల రోజులు అవుతుండటంతో పంటకు యూరియా చల్లాల్సి ఉంది. యూరియా కోసం దుకాణాలకు వెళ్లగా లేదని చెప్పడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు మండలంలోని సాగు విస్తీర్ణానికి అవసరమైన మేర యూరియాను యుద్ధ ప్రాతిపదికన సహకార సంఘాలు, ఫర్టిలైజర్స్ షాపులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెమడాల భిక్షం, బొమ్మగాని శ్రీనయ్య, వలమల్ల ఎల్లయ్య, బ్రహ్మచారి, పాలకూరి రాములు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చింతపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని తక్కళ్లపల్లిలో గురువారం జైభవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపారు. యంత్రవిగ్రహ ప్రతిష్ఠాపన, బలిహారణ, కుంభనివేదన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు దేరం భాస్కర్‌శర్మ, గ్రామపురోహితుడు వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ, జై భవానీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముద్దం రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచులు ముద్దం సత్తమ్మ మారయ్యగౌడ్, గుండ్లపల్లి అనిత నరసింహారెడ్డి, మాజీ ఉప సర్పంచి మేతరి శోభారాణి ఏసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు

దామరచర్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నర్సాపురం, పెద్దతండా ప్రాథమిక పాఠశాలకు ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలను పాఠశాలలో నమోదు చేసుకుంటామని అన్నారు. ఆయాల సంరక్షణలో బోధన ఉపకరణాల ద్వారా ఆకర్షణీయమైన తరగతి గదిలో కృత్యాధార బోధన అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

చివరి భూములకు నీరందిస్తాం

మాడ్గులపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాల్వ చివరి భూములకు నీరందిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పానగల్ ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి డి-40 కాల్వకు అధికారులు నీటిని విడుదల చేశారు. మాడ్గులపల్లి మండలంలోని చివరి ఆయకట్టుకు నీరందించేందుకు 8 రోజుల పాటు పైన ఉన్న తూములన్నింటినీ నిలుపుదల చేసి నీటిని అందిస్తున్నారు. ఈ నెల 19 వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'చివరి రైతుల అవస్థలు' అనే శీర్షికన ప్రచురిత మైన వార్తకు అధికారులు స్పందించారు. దీంతో వారం రోజులుగా వారబం దీ విధానంలో చివరి ఆయకట్టు రైతులకు నీటి విడుదలను కొనసాగించారు. వారబందీ విధానం కావడంతో పైన ఉన్న తూములనన్నింటినీ నిలుపుదల చేసి చివరి భూముల వరకు నీటిని అందించేందుకు నీటి పారుదల అధికారు లు కృషి చేశారు. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

నానో యూరియాపై దృష్టి సారించాలి

దామరచర్ల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నానో యూరియాపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి రుషేంద్రమణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ వద్ద రైతులకు నానో యూరియాపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నానో యూరియాను రైతులు ఉపయోగించడం వల్ల సంప్రదాయ యూరియాతో పోలిస్తే సాగు ఖర్చు తగ్గి దిగుబడి అధికంగా వస్తుందన్నారు. రైతులు నానో యూరియాపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సైదులు, ప్రియాంక, పార్వతి, సురేష్, మధు, శేఖర్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇక్కట్లు

- రెండు రోజులుగా అందని భగీరథ నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఆటో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా

చింతపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల కూడలి, దినదినాభివృద్ధి చెందుతున్న గొడకొండ్ల (వీటీనగర్)లో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూత వేటు దూరంలో గొడకొండ్ల రిజర్వాయర్ ఉన్నా మిషన్‌భగీరథ నీరు మాత్రం సరఫరా కావడం లేదు. రెండు రోజులుగా మిషన్‌భగీరథ సరఫరా చేసే నీటి పైపులు మరమ్మతులకు గురి కావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం బోనాల ఉత్సవాలు కావడంతో మహిళలు పవిత్ర స్నానాలు ఆచరించి బోనాలు గ్రామదేవతలకు సమర్పించనున్నారు. ప్రధానంగా గొడకొండ్ల, వెంకటేశ్వరనగర్, పోలేపల్లిలో మిషన్‌భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో ఆటో ట్యాంకర్ నీటికి రూ. 800 నుంచి 1000 డబ్బులు ఖర్చు చేసి నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించి ఆటో ట్యాంకర్ డ్రైవర్లు అధిక డబ్బులు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై మిషన్‌భగీరథ సూపర్‌వైజర్ అరవింద్‌రెడ్డిని వివరణ కోరగా నీటి పైపులు పగిలిపోవడంతో అంతరాయం కలిగింది. రెండు రోజుల్లో పైపులకు మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అతుకుల బొంత

- అధ్వానంగా రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గుంతలమయమై వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా ఉన్న రహదారి బంగ్లాకు వెళ్లే రోడ్డు

దేవరకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రధాన రహదారి, రహదారి బంగ్లాకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షానికి గుంతలలో వర్షపు నీరు నిలబడటంతో ప్రమాదకరంగా మారింది. గుంతలు పూడ్చి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అదే మార్గంలో రహదారి బంగ్లాతో పాటు ఎంపీడీవో, వ్యవసాయ, అటవీశాఖలతో పాటు వివిధ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. గుంతలమయంగా మారిన ఈ దారి వెంట కార్యాలయాలకు వెళ్లాలంటే సిబ్బందితో పాటు ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. నూతనంగా రోడ్డు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని పట్టణానికి చెందిన వలమాల ఆంజనేయులు, వస్కుల సుధాకర్, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- ఆర్డీవో రమణారెడ్డి, ఏఎస్పీ మౌనిక



శాంతిసంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి, ఏఎస్పీ మౌనిక

దేవరకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభంకానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా ఆనందోత్సవాలతో నిర్వహించుకోవాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, ఏఎస్పీ మౌనిక కోరారు. దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన శాంతిసంఘం సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు పోలీస్‌శాఖ సూచించిన నిబంధనలు పాటించాలన్నారు. నిర్వాహకులు గణేష్ ఉత్సవాల కోసం అనుమతులు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, డిండి రూరల్ సీఐ బీసన్న, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, వివిధ పార్టీల నాయకులు, శాంతిసంఘం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

'మార్వాడీ గోబ్యాక్' నినాదంతో వ్యాపారుల ర్యాలీ

- నేడు వ్యాపార సంస్థల బంద్‌కు పిలుపు

దేవరకొండ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండలోని వ్యాపారులు మార్వాడీ గోబ్యాక్ అనే నినాదాలు చేస్తూ గురువారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం దేవరకొండ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు వారు తెలిపారు. స్థానిక వ్యాపారులపై రాజస్థాన్, గుజరాత్ మార్వాడీ వ్యాపారులు అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. బంద్‌ను విజయవంతం చేయాలని వ్యాపార సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యాపార సంఘాల నాయకులు నీల బుచ్చయ్య, కాడూరి నర్సయ్య, రామాచారి, శీను తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: తెలంగాణ జేఏసీ పిలుపు మేరకు 'మార్వాడీ హఠావో తెలంగాణ బచావో' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొండమల్లేపల్లిలో వ్యా పార సముదాయాలు బంద్ నిర్వహించనున్నారు. కిరాణ, ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్, వస్త్ర దుకాణ, స్టీల్, సిమెంట్, మొబైల్, స్వర్ణకారులు, చెప్పులు, హెయిర్ సెలూన్, రెడీమేడ్ దుకాణ తదితర దుకాణ సముదాయాల అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

(5వపేజీ తరువాయి)

వద్ద ఉన్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా 1000 మెట్రిక్ టన్నుల నిల్వలుండగా, మరో 500 మెట్రిక్ టన్నులు గురువారంరాత్రి జిల్లాకు చేరుకోనుంది. 23 లేదా 24 తేదీల్లో మరో 1000 మెట్రిక్ టన్నులు జిల్లాకు దిగుమతి కానుంది. కలెక్టర్ ఇలాత్రిపాఠి నిరంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ రైతుల ఇబ్బందులు తొలగించేందుకు క్రమక్రమంగా యూరియాను తెప్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాకు మరో 25వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం

వానాకాలం సీజన్‌లో జూన్‌నుంచి సెప్టెంబరు వరకు అంటే నాలుగు నెలలపాటు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. ఆగస్టు మూడోవారం వచ్చే సరికి 45వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించారు. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి, వరి పంట విస్తీర్ణం పెరిగింది. జిల్లాలో పత్తి విస్తీర్ణం 5.70లక్షల ఎకరాల వరకు పెరగగా, వరి ఇప్పటివరకే 3.50లక్షల వరకు సాగైంది. మరో లక్షన్నర ఎకరాల్లో ఈ నెలాఖరులోగా నాట్లు పడనున్నాయి. ఇప్పటికే 45వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరినందున సెప్టెంబరు నెలాఖరు వరకు మరో 25వేల మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి చేయాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా 5వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు కోటా వస్తే అందులో నుంచి యూరియా జిల్లాకు 4వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద వరి విస్తీర్ణం పెరగడంతోపాటు బోరు బావుల కింద కూడా వరిసాగు ముమ్మరం కావడంతో యూరియా అవసరాలు పెరిగాయి. దీనికితోడు జిల్లాలో జూలై నెలలోనే అత్యధికంగా అవసరానికి మించి యూరియాను రైతులు నిల్వ చేసుకున్నట్లు సమాచారం. దీంతోనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని వ్యవసాయశాఖ భావిస్తుంది.

మరో నాలుగైదు రోజులపాటు అరకొరే..

జిల్లావ్యాప్తంగా మరో నాలుగైదు రోజులపాటు యూరియా అరకొరగానే సరఫరా అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో యూరియా అవసరం ఉన్న రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాలు మాత్రమే ఇవ్వనున్నారు. అయితే కొన్నిచోట్ల ఒకే కుటుంబానికి చెందిన వారు తమ ఆధార్ కార్డుల ద్వారా అధికంగా యూరియాను తీసుకునే అవకాశాలున్నాయని అధికారులు భావించి అవసరం ఉన్న వారికే యూరియాను విక్రయించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. దీనికితోడు అధిక ధరలకు యూరియాను విక్రయించకుండా డీలర్లపై వ్యవసాయ శాఖ నిఘా పెట్టింది. గత రెండున్నర నెలలుగా ఎమ్మార్పీ ధరలు అంటే గరిష్ఠ రిటైల్ ధరకు మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నిచోట్ల ఎరువుల వ్యాపారులు యూరియా బస్తాలు కావాలంటే ఇతర ఎరువులు కొనుగోలు చేయాలని లింక్ పెట్టడంతో దీంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఈ లిక్విడ్ నానో యూరియా కూడా యూరియాతో సమానంగా పంటల దిగుబడి వచ్చేలా పనిచేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే రైతుల్లో ఇంకా అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. మొత్తానికి మరో నాలుగైదు రోజులపాటు యూరియా కొరత ఉండే పరిస్థితుల్లో సమస్యను ఏ విధంగా వ్యవసాయ శాఖ అధిగమిస్తుందో వేచి చూడాల్సిందే.

అవసరాలకు అనుగుణంగా యూరియా

జిల్లాలో ఒక గురువారంనాడే 5వేల మంది రైతులకు 1000 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీచేశాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఇలా త్రిపాఠి నిరంతరం సమీక్ష చేస్తూ వ్యవసాయశాఖకు తగిన ఆదేశాలు, సూచనలు ఇస్తూ ఎరువుల కొరత లేకుండా మానిటరింగ్ చేస్తున్నాం. యూరియాకోసం రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు. యూరియా అవసరం ఉన్న రైతులు మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ నెలాఖరులోగా మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుంది.

\- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

వైభవంగా బోనాల పండుగ

- పెద్దమ్మ, ముత్యాలమ్మకు నైవేద్యాలు


పీఏపల్లి: ముత్యాలమ్మకు బోనాలు సమర్పించేందుకు వెళ్లుతున్న మహిళలు

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగడిపేట, అంగడిపేట ఎక్స్‌రోడ్డులో బోనాల పండుగను యాదవ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల నడుమ గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం చివరి గురువారం కావడంతో గ్రామ దేవత ముత్యాలమ్మకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మేళా తాళాల నడుమ బోనాలతో ఊరేగింపుగా బయల్దేరి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణానికి చేరుకుని గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోళ్లు, నైవేద్యం అమ్మవార్లకు సమర్పించి చల్లగా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఉత్సవాలను తిలకించేందుకు మండల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పెద్దమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డిండి మండల కేంద్రంలో పోచమ్మ ఊరబోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. పోచమ్మకు పంచామృతంతో అభిషేకం చేశారు. పోచమ్మ, కోటమైసమ్మ, బొడ్రాయి వద్ద నూతన వస్త్రాలంకరణ, విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పోతరాజుల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువతీ, యువకులు బోనాలతో పాల్గొన్నారు.

నిడమనూరు మండలంలోని వెంగన్నగూడెం గ్రామంలో బోనాల పండుగను నిర్వహించారు. తొలుత బొడ్రాయి, ముత్యాలమ్మ గుడుల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు చేసి అమ్మవారికి చీర, సారె సమర్పించుకున్నారు. ముత్యాలమ్మ గుడి వద్ద కోళ్లు, మేకలు బలి ఇచ్చారు. అనంతరం ఊరు శివారు ప్రాంతాలకు వన భోజనాలకు కుటుంబ సభ్యులతో వెళ్లి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఊర రవి, సలాది నాగరాజు, కొండారు చంద్రశేఖర్, జనార్దన్, లక్ష్మీనర్సయ్య, అయోధ్య, నర్సయ్య, నాగార్జున, యాదయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమనిధి ఉపాధ్యాయుల పాలిట వరం

చింతపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ఉపాధ్యాయులకు సంక్షేమనిధి పెద్ద వరమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న తిరందాసు యాదగిరి ఇటీవల మృతి చెందారు. గురువారం మన్నెగూడలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమనిధి చైర్మన్ ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో ఎస్.అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమళ్ల వెంకటేశం, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ గేర నరసింహ, జిల్లా కార్యదర్శులు కాశిరెడ్డి, కృష్ణారెడ్డి, కోట్ల యాదగిరి, నలపరాజు వెంకన్న, జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ గిరి యాదయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి జి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని ఆగామోత్కూర్, ఇందుగుల గ్రామాల్లోని పీహెచ్‌సీ సెంటర్లను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విధులకు సక్రమంగా హాజరుకావాలని సూచించారు. రోగులకు అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సరోజ పావని, ఎంపీవో సంగీత, ఆర్‌ఐలు రేణుక, నాగయ్య ఉన్నారు.

'ఉల్లాస్'ను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో లావూరి బాలు కోరారు. పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉల్లాస్ తరగతులను డీఆర్పీ బాలుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ అక్షరాస్యత లేని ప్రజలకు చదవడం, రాయడం నేర్పించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పథకమే ఉల్లాస్ అని అన్నారు. చదవడం, రాయడం రాని వాళ్లలో అధికులు ఆర్థిక నేరాల బారిన పడుతున్నారని, వారందరికీ కనీస పరిజ్ఞానం నేర్పించడమే లక్ష్యంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో పేర్కొన్న విధంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమభావన సంఘ సభ్యులు, వయోజనులకు అక్షర బోధన చేయనున్నట్లు పేర్కొన్నారు. డీఆర్పీ బాలు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్లు రఘు, వెంకన్న, శ్రీనివాసరెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు

కొండమల్లేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరికుంటతండాలో గురువారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు మొలకల బుట్టలను నెత్తిన పెట్టుకొని గిరిజన సంప్రదాయ నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో రమావత్ దీప్‌లాల్, ఉట్కూరి వేమన్‌రెడ్డి, అభిషేక్ నాయక్, రమావత్ కృష్ణనాయక్, రవినాయక్, రమేష్, శివనాయక్ పాల్గొన్నారు.

బత్తాయి ధర.. ధమాల్ !

(5వపేజీ తరువాయి)

ముంబై, చెన్నై మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాల్లో బత్తాయిల సాగు ఎక్కువవడంతో చెన్నై, బెంగళూరు మార్కెట్లకు ఇక్కడినుంచి బత్తాయి వెళ్లడం లేదు. మహారాష్ట్రలోనూ నాందేడ్ పరిసర జిల్లాల్లో బత్తాయిల సాగు పెరిగింది. దీంతో ముంబై మార్కెట్లోనూ పోటీ పెరిగి మన కాయకు డిమాండ్ తగ్గిందని చెబుతున్నారు. దీంతో హైదరాబాద్‌తో పాటు ఉత్తరభారతదేశ మార్కెట్‌లే నల్లగొండ బత్తాయిలకు పరిమితమవగా, అక్కడ భారీ వర్షాల నేపథ్యంలో ఈసారి డిమాండ్ తగ్గింది. దీనికితోడు ప్రధానంగా బత్తాయికి నిల్వ సామర్థ్యం లేకపోవడం, పండ్ల రూపంలో గరిష్ఠంగా పది రోజులకు మించి నిల్వ ఉంటే చేదుగా మారుతుండటం, జ్యూస్ రూపంలోకి మార్చాక కనీసం రెండు, మూడు రోజుల పాటు కూడా ఉండని పరిస్థితి నెలకొంది. ఇవి బత్తాయి సాగుకు పెద్ద ఆటంకంగా మారింది. బత్తాయి సాగను ఒక దశలో ప్రత్యామ్నాయ పంటగా ప్రభుత్వం ప్రోత్సహించినా శాశ్వతంగా దానిని కొనసాగించేందుకు అవసరమైన సాంకేతికత వృద్ధి, పరిశోధనలపై ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో దళారులు చెప్పిందే వేదంగా మారింది. దీంతో బత్తాయి సాగు రైతులకు గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో క్రమంగా నీటి వనరులు ఉన్న రైతాంగం బత్తాయి స్థానంలో వరి సాగుకు మారుతుండటంతో జిల్లాలో సాగు విస్తీర్ణం పడిపోయింది.

ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి



బత్తాయి రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు. దళారుల చేతిలో బతుకైపోయింది. టన్నుకు రూ.13 నుంచి 15వేలకు మించి ధర ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడులు రాని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించి కనీస మద్దతు ప్రకటించాలి. లేకపోతే జిల్లాలో బత్తాయి తోటల సాగు కనుమరగయ్యే ప్రమాదం నెలకొంది.

\- నెర్మాటి సీతారాంరెడ్డి, అంగడి పేట, పీఏపల్లి మండలం

కాయలు చెట్లమీదనే రాలిపోతున్నాయి



నేను రెండు ఎకరాల్లో బత్తాయి సాగు చేశాను. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారులు టన్నుకు రూ.12 వేలే ఇస్తామంటున్నారు. మేము ఆ ధరకు ఇవ్వలేకపోతున్నాం. చెట్లమీదనే కాయలు రాలిపోతున్నాయి. బత్తాయి సాగు చేసే రైతుల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించి ఆదుకునే చర్యలు చేపట్టాలి.

\- తగుళ్ల సర్వయ్యయాదవ్, గుర్రంపోడు

బత్తాయికి ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి

బత్తాయి పండ్లకు మార్కెట్ లేకపోవడంతో ధర పూర్తిగా పడిపోయింది. పెట్టుబడులు కూడా రావడం కష్టమైన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌ను నియంత్రించి రైతులకు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

\- మల్లికార్జున్, రైతు, హాలియా

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహావతార్ నరసింహ రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, వార్-2,కింగ్‌డమ్ దేవరకొండ: మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : కూలీ